# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక









అమలాపురం | సంపుటి : 10 సంచిక : 21 | ఎడిటర్ : అయితాబత్తుల రాజశేఖర్ | గురువారం 13 మార్చి 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amlapuram Vol:10 Issue : 21 13-03-2025 Edirtor : AITHABATHULA RAJASEKHAR Pages : 8 Rs: 5/-


## జనసేన ఆవిర్భావ సభకు 'జయకేతనం' అనే పేరు




అమరావతి మార్చి 12 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

జనసేన పార్టీ ఆవిర్భావ సభను ఈ నెల 14న గ్రాండ్‌గా నిర్వహించేందుకు పార్టీ సన్నాహాలు పూర్తి చేసింది. ఈ ప్రత్యేక సభకు 'జయకేతనం' అనే పేరు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ స్వయంగా పెట్టారు. ఈ విషయాన్ని జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. పిఠాపురం నియోజకవర్గంలోని చిత్రాడ వద్ద జరగనున్న ఈ సభ, రాష్ట్ర రాజకీయ చరిత్రలో నిలిచిపోతుందని ఆయన ప్రకటించారు.

**రాష్ట్రం నలుమూలల నుంచి జనసైనికుల సమాగమం**

ఈ భారీ సభకు రాష్ట్రవ్యాప్తంగా జనసేన అభిమానులు, వీర మహిళలు భారీ సంఖ్యలో హాజరుకానున్నారు. కేవలం ఆంధ్రప్రదేశ్ నుంచి మాత్రమే కాకుండా, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు నుంచి కూడా జనసేన అనుచరులు తరలిరానున్నారు. పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని ఈ సభ రాష్ట్ర సంస్కృతి, స్థానిక చరిత్రకు అద్దం పట్టేలా ఉంటుందని నాదెండ్ల మనోహర్ తెలిపారు.

**మహానుభావుల సేవలను స్మరించుకునే ప్రవేశ ద్వారాలు**

సభ ప్రాంగణానికి చారిత్రక ప్రాముఖ్యతను చాటేలా, మహానుభావుల పేర్లు ఇచ్చిన మూడు ముఖద్వారాలను ఏర్పాటు చేశారు. మొదటి ద్వారానికి పిఠాపురం మహారాజు శ్రీ రాజా సూర్యరావు

- తరువాయి 2లో..

## ఈ నెల 19న తెలంగాణ బడ్జెట్



హైదరాబాద్ మార్చి 12 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఈ నెల 19 న తెలంగాణ బడ్జెట్ ను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన బీఏసీ సమావేశంలో ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు. ఈ నెల 13న గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరగనుంది. 14 న హెూలీ సందర్భంగా అసెంబ్లీకి సెలవును ప్రకటించారు. 17, 18 తేదీల్లో బీసీ రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ బిల్లులు ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఈ నెల 27 వ తేదీ వరకు బడ్జెట్ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. 21 నుంచి 26 వరకు పద్దులపై చర్చ జరగనుంది.

# తెలుగుదేశం పార్టీ.. తెలుగింటి ఆడపడుచుల పార్టీ!

## అసెంబ్లీలో మహిళా సాధికారత అంశం

- మహిళలను దృష్టిలో పెట్టుకునే సంక్షేమ పథకాలు
- ఆస్తిలో మహిళలకు సమాన వాటా ఇచ్చింది ఎన్టీఆర్
- రిజర్వేషన్స్ అమలైతే 70-75 మంది మహిళా ఎమ్మెల్యేలు

అమరావతి మార్చి 12 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

**తెలుగుదేశం పార్టీ తెలుగింటి ఆడపడుచుల పార్టీ అని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ప్రభుత్వం ఏ కార్యక్రమం చేపట్టినా.. మహిళలను దృష్టిలో పెట్టుకునే చేశామన్నారు. ఆస్తిలో మహిళలకు సమాన వాటా ఇచ్చింది ఎన్టీఆర్ అని తెలిపారు. తల్లికి, చెల్లికి వాటా ఇవ్వని వ్యక్తి గతంలో సీఎంగా పనిచేశారని మండిపడ్డారు. రిజర్వేషన్స్ అమలైతే 70-75 మంది మహిళా ఎమ్మెల్యేలు అసెంబ్లీలో ఉంటారన్నారు. అమెరికా లాంటి దేశాలలో కూడా మహిళలకు సమానత్వం లేదని, సమాజంలో మార్పు రావాల్సిన అవసరం ఎంతో ఉందని సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు. మహిళా సాధికారత అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అసెంబ్లీలో మాట్లాడారు.**



'మహిళా సాధికారత కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుంది. సంక్షేమం, అభివృద్ధి.. ఏదైనా మహిళలను దృష్టిలో పెట్టుకుని చేస్తాము. మహిళా సాధికారతపై మాటలు చెప్పడం వేరు.. చేతలు వేరు. మహిళలకు సమాన హక్కులు కల్పించడం అందరి బాధ్యత. ఇప్పటికీ మహిళలు వివక్షకు గురి అవుతున్నారు. మహిళలను చూస్తే ఇప్పటికీ చిన్నచూపు ఉంది. మహిళలు ప్రతి స్టేజ్లో ఎవరో ఒకరిపై ఆధారపడి ఉండే పరిస్థితి. మహిళా సాధికారత టీడీపీ నుంచి మొదలు అయింది. తెలుగుదేశం పార్టీ తెలుగింటి ఆడపడుచుల పార్టీ. మహిళలను దృష్టిలో పెట్టుకునే సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం. ఆస్తిలో మహిళలకు సమాన వాటా ఇచ్చింది ఎన్టీఆర్. తల్లికి, చెల్లికి వాటా ఇవ్వని వ్యక్తి గతంలో సీఎంగా పనిచేశారు' అని సీఎం చంద్రబాబు అన్నారు. 'విద్యలో మహిళలను ప్రోత్సహించాలి. మహిళలకు ఇచ్చిన 33 శాతం రిజర్వేషన్‌తో సెలెక్ట్ అయిన అధికారిణి సూర్యకుమారి. ఇప్పుడు మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శిగా ఉన్నారు. రాష్ట్రపతి ముర్ము, కేంద్ర మంత్రి నిర్మల సీతరామన్ మహిళలకు ఆదర్శంగా ఉన్నారు. రిజర్వేషన్స్ అమలైతే 70-75 మంది మహిళా ఎమ్మెల్యేలు అసెంబ్లీలో ఉంటారు. మగవారి కంటే ఆడవారు చాలా తెలివైన వారు. ఇప్పుడు మహిళలకే ఎదురుకట్నం ఇచ్చే పరిస్థితి వచ్చింది. అమెరికా లాంటి దేశాలలో కూడా మహిళలకు సమానత్వం లేదు. సమాజంలో మార్పు రావాల్సిన అవసరం


- తరువాయి 2లో..

### సీఐడీ విచారణకు హాజరైన మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి



2 లో..

### వైసీపీ పాలనలో విశ్వవిద్యాలయాల ర్యాంకింగ్స్ పతనం - నారా లోకేష్



2 లో..

# చంద్రబాబు కృషితోనే పోలవరం ప్రాజెక్ట్‌కు భారీగా నిధులు

## జగన్ ప్రభుత్వంలో పోలవరం ప్రాజెక్ట్‌ను విధ్వంసం చేసింది..

### డబుల్ ఇంజన్ సర్కార్ ఫలితాలు పోలవరం పనుల్లో కనిపిస్తుంది: మంత్రి నిమ్మల



అమరావతి మార్చి 12 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

**ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే.. చంద్రబాబు కృషితోనే పోలవరం ప్రాజెక్ట్ కు నేటికి రూ. 5052 కోట్ల నిధులు అడ్వాన్స్ గా రావడం జరిగింది అని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. నాడు జగన్ ప్రభుత్వంలో కేంద్రం విడుదల చేసిన పోలవరం రియంబర్స్మెంట్ నిధులను సైతం దారి మళ్లించి ప్రాజెక్ట్ ను విధ్వంసం చేసింది అని ఆరోపించారు. నేడు డబుల్ ఇంజన్ సర్కార్ ఫలితాలు, పోలవరం పనుల ప్రగతిలో కనిపిస్తున్నాయని వెల్లడించారు. అంతర్జాతీయ నిపుణుల కమిటీ, CWC, PPA లను ఎప్పటికప్పుడు సమన్వయ పర్చుకుంటుందని మంత్రి నిమ్మల చెప్పుకొచ్చారు.**

ఇక, 2027 డిసెంబర్ నాటికి ప్రాజెక్ట్ నిర్మాణ పనులు పూర్తి చేసేలా, డిజైన్స్ కు అనుమతులు తీసుకుంటున్నామని మంత్రి నిమ్మల రామానాయుడు

- తరువాయి 2లో..

# ప్రజల గొంతుకవుతాం..!

## వైసిపి ఆవిర్భావ సభలో జగన్‌మోహన్‌రెడ్డి

తాడేపల్లి ఫిబ్రవరి 12 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

'ప్రజల కష్టాల నుండి వైసిపి పుట్టింది. వారికి తోడుగా నిలిచింది. ఇప్పుడు కూడా ప్రజల గొంతుక అవుతాం. వారి తరపున ప్రశ్నిస్తాం.' అని మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. వైసిపి 15వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ వైసిపి స్థాపించి 15 సంవత్సరాలు అవుతోందని, ఈ పదిహేను ఏళ్లలో పది సంవత్సరాలు ప్రతిపక్షంలోనే ఉన్నామని చెప్పారు. 'ప్రతి పక్షంలో కూర్చోవడం కొత్తేమీ కాదు. పది సంవత్సరాలు ప్రతిపక్షంలోనే అధికారపక్షానికి దీటుగా నిలిచాం.' అని అన్నారు.. కళ్లుమూసి తెరిచేలోపు ఏడాది అయిపోయిందని, మరో మూడు, నాలుగేళ్లలో వైసిపినే అధికారంలోకి వస్తుందని చెప్పారు. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చిన పదినెలల్లో సూపర్‌సిక్స్, సూపర్‌సెవన్ అన్నీ గాలికెగిరిపోయాయని అన్నారు. ఫీజులు, విద్యాదీవెన, రీయంబర్స్‌మెంట్‌కు సంబంధించి ఏడాదికి రూ.2,800 కోట్లు కేటాయించాలని, వసతి దీవెన కింద రూ.1,100 కోట్లు కేటాయించాలని, మొత్తంగా రూ.3,900 కోట్లు కేటాయించాల్సి ఉంటే రూ.700 కోట్లు ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. 2025-26కు సంబంధించి విద్యార్థులకు రూ.7,100 కోట్లు కేటాయించాల్సి ఉండగా,



రూ.2,600 కోట్లు మాత్రమే కేటాయించారని తెలిపారు. వైసిపి ఎప్పుడూ ప్రజలకు తోడుగా ఉంటుందని చెప్పారు. అనంతరం విద్యార్థుల ఫీజు అంశంపై ఎక్స్‌లో పోస్టు కూడా చేశారు. ఆవిర్భావ దినోత్సవంలో మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, పార్టీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీపార్వతి, మహిళా విభాగం అధ్యక్షులు వరుదు కళ్యాణి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

తెలుగురాష్ట్రం దినపత్రిక

# సంపాదకీయం

## నవ భారత ప్రణాళిక

**ఒక సమాఖ్య దేశంగా భారత్ క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటోంది. దేశంలోని భిన్నత్వాలన్నింటినీ కలిపి ఉంచే లక్ష్యంతో ఏర్పాటు చేసు కున్న రాజ్యాంగానికి పెను సవాలు ఎదురవు తోంది. భిన్న జాతులు, సంస్కృతులు, భాషల సమ్మేళనంతో కూడిన భిన్నత్వమే దీని ప్రత్యేకత. జనాభా కూర్పు కూడా ఈ దేశం హిందీ భాష, హిందుత్వ భావజాలంతోనిండి పోయేందుకు అవకాశం కల్పించదు.**

**విద్యను రాష్ట్ర జాబితాలో చేర్చాలి!**

ఈ దేశంలో ప్రతి రాష్ట్రమూ తనదైన రీతిలో ఒక ప్రత్యేక జాతి లాంటిది. అందుకే రాజకీయ, ఆర్థిక విషయాల్లో వీటి మధ్య సమ తౌల్యతను కాపాడాల్సిన అవసరముంది. 2026లో ప్రభుత్వం ప్రారంభించ తలపెట్టిన నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ పార్లమెంటులో కొన్ని రాష్ట్రాల శక్తిని తగ్గించేదిగా ఉంటుంది. జనాభా నియంత్రణ ద్వారా ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలను ఇచ్చేందుకు ఆ రాష్ట్రాలు చేసిన కృషికి లభించనున్న ప్రతిఫలమా ఇది!

జనాభా నియంత్రణలో మంచి ఫలితాలు సాధించని రాష్ట్రాలకు మరిన్ని పార్లమెంటరీ నియోజకవర్గాలను సృష్టించటం ద్వారా ప్రోత్సాహ కాలు లభించనున్నాయి. ఈ నేపథ్యంలో ఒక్క విషయమైతే స్పష్టం చేయాలి. ఈ పునర్విభజన ప్రకియను తక్షణం నిలిపివేయాలి. ప్రస్తుతం ఉన్న పార్లమెంటరీ నియోజకవర్గాలను మార్చడంపై శాశ్వత నిషేధం విధించాలి.ఇది సాంకేతిక పరిజ్ఞాన యుగం. నాణ్యమైన విద్య ఉన్న వారే సామాజిక ఫలాలను నిర్ణయిస్తారు. నియంత్రణ మొత్తం కేంద్రం చేతుల్లో ఉన్నప్పటికీ ఉన్నత విద్యారంగం ఇప్పటివరకూ ఆశించిన ఫలితాలనైతే ఇవ్వలేదు.

ఉన్నత విద్య నాణ్యత కూడా ఆశించిన ప్రమాణాల మేరకు లేదు. కాబట్టి విద్య మొత్తాన్ని రాష్ట్రాల జాబి తాలోకి చేర్చడం మంచిది. రాష్ట్రాలపై ఏఐసీటీఈ (ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్), యూజీసీ (యూనివర్సిటీగ్రాంట్స్ కమిషన్) వంటి సంస్థల పెత్తనానికి ఫుల్‌స్టాప్ పడాలి. దేశానికి నాణ్యమైన ఆధునిక వైద్య, న్యాయ, సామాజిక శాస్త్రాల విద్య అవసరం. నాణ్యమైన విద్యను అందించే విషయంలో రాష్ట్రాలు ఒకదానితో ఒకటి పోటీ పడేలా చేయాలి కానీ, పరిపాలన పేరిటకేంద్రం పెత్తనం చలాయించ కూడదు.

**పన్నుల వాటా 66 శాతానికి చేరాలి!**

రాష్ట్రాలు ఆర్థికంగా స్వావలంబన, స్వతంత్రత సాధించినప్పుడే సమాఖ్య స్ఫూర్తి వర్ధిల్లుతుంది. ఆర్థిక వనరుల విషయంలో రాష్ట్రాలకు మరిన్ని మార్గాలు అందుబాటులో ఉండాలి. ప్రస్తుతం ఫైనాన్స్ కమిషన్ సిఫారసుల మేరకు రాష్ట్రాలకు పన్నుల ఆదాయంలో 42 శాతం మాత్రమే లభిస్తోంది. పైగా ఇటీవలి కాలంలో కేంద్రం వద్దనే వనరులను కేంద్రీకరించే ధోరణి కనపడుతోంది. ఈ పరిస్థితి మారాలి. రాష్ట్రాలకు దక్కాల్సిన పన్నుల వాటా క్రమేపీ 66 శాతానికి చేరాలి. కేటాయింపులు కూడా జనాభా, తీసుకొచ్చిన ఆదాయం, సగటు కంటే ఎంత ఎక్కువ ఉంది అనే అంశాలతో కూడిన సూచీ ఆధారంగా జరగాలి.

రాష్ట్రాలకు అందాల్సిన మొత్తాల విడుదలల్లోనూ అనవసరమైన జాప్యాన్ని చూస్తున్నాం. రాష్ట్రాల ఆదాయాలను కేంద్ర పథకాలకు ఉపయోగిస్తున్నారు. రాష్ట్రాలు తమ ప్రణాళికలు, హామీలను నెరవేర్చుకునేందుకు వీలుగా ఆదాయం ఎక్కడికక్కడ పంపిణీ జరిగేలా ఒక వ్యవస్థను రూపొందించాల్సిన అవసరం ఉంది. కేంద్రం ద్వారా నిధుల విడుదలల్లో ఆలస్యం జరిగితే ఆర్‌బీఐ ప్రైమ్ లెండింగ్ రేట్లతో రాష్ట్రాలకు వడ్డీ చేర్చి ఇవ్వాలి.

దేశాద్యంతం చరిత్ర, సంస్కృతులు ఒక్క తీరున లేవు. ప్రతి ప్రాంతంలోనూ తనదైన ప్రత్యేకత కలిగిన చారిత్రక, సాంస్కృతికకేంద్రాలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వపు ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) వీటి నిర్వహణ, సంరక్షణల్లో ఘోరంగా విఫల మైంది.

ఆకతాయిలు పలు స్మారకాలను ధ్వంసం చేశారు. అన్ని రాష్ట్రాల్లో, ప్రాంతాల్లోనూ ప్రత్యేకమైన సంస్కృతి, చరిత్ర ఉన్న నేపథ్యంలో వాటి సంరక్షణ, నిర్వహణ బాధ్యతలు ఆయా రాష్ట్రాలకే అప్పగించాలి. ఆయా వనరులపై కేంద్రం పెత్తనం చలాయించకుండా వెంటనే రాష్ట్రాలకు బదలాయించాలి. సంకుచిత సైద్ధాంతిక భావ జాలం కారణంగా ఏఎస్ఐ, కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖ కొన్ని ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి పెట్టే ధోరణి కనిపిస్తోంది.

**సహజ వనరులపై హక్కు**

రైతుల నుంచి సేకరించే పంటలకు మద్దతు ధర ఇవ్వడం ప్రస్తుతం కొన్ని రాష్ట్రాలు, ప్రాంతాలకు మాత్రమే పరిమితమై ఉంది. ఈ సేకరణ ఒక రకమైన సబ్సిడీనే కాబట్టి... ఆయా నిధులను వ్యవసాయ భూమి విస్తీర్ణం ఆధారంగా రాష్ట్రాలకే కేటాయించాలి. దేశాద్యంతం పండే పంటల్లో ధాన్యమే ఎక్కువ కాబట్టి అన్ని రాష్ట్రాల్లోనూ ధాన్యం సేకరణకు కనీస మద్దతు ధర అందించాలి. ఒకవేళ అన్ని రాష్ట్రాలకూ ఈ పద్ధతి అనువుగా ఉండదనుకుంటే... ఆయా రాష్ట్రాలకు గ్రాంట్ల రూపంలో నష్టపరిహారాన్నైనా అందించాలి. వాయు కాలుష్యంలో శిలాజ ఇంధనాల వాటా దాదాపు 20 శాతం. చౌక ప్లాస్టిక్ విచ్చలవిడి వినియోగం (ప్యాకేజింగ్, ఒకసారి వాడి పారేయడం) వల్ల జల వనరులకు తీవ్ర నష్టం జరుగుతోంది. దీన్ని అరికట్టేందుకు వాడి పారేసే ప్లాస్టిక్ తయారీకి ఉపయోగించే ముడి సరుకులపై సుంకాలు విధించాలి. విద్యుత్తుతో, హైడ్రోజెన్ ఫ్యూయెల్ సెల్స్‌తో నడిచే వ్యక్తిగత, రవాణా వాహనాల వాడకాన్ని ప్రోత్సహించాలి.

వీటిపై పన్నులు ఎత్తివేయడం, వాడుతున్నందుకు ప్రోత్సాహకాలు అందించడం చేయాలి. గంగా పరీవాహక ప్రాంతాన్ని మినహా మిగిలిన చోట్ల బొగ్గు, ఇనుము, అల్యూమినియం, రాగి,జింక్, నికెల్ వంటి ఖనిజ నిక్షేపాలు బోలెడున్నాయి. ఈ ప్రకృతి వనరులపై సహజంగానే ఆయా ప్రాంతాల్లో ఉండే ప్రజలకు హక్కు ఉంటుంది. కాబట్టి ఖనిజాన్వేషణ, వెలికితీత హక్కులు, ఆదాయం కూడా ఆయా రాష్ట్రాలకే చెందాలి.

**ఆర్మీలో కొన్ని ప్రాంతాలకేనా అవకాశం?**

సాయుధ దళాలు, పారామిలిటరీ దళాల్లో నియామకాలు కొన్ని ప్రాంతాల్లోనే కేంద్రీకృతమై ఉన్నాయి. దేశంలోనే అతి పురాతనమైన పదాతిదళ రెజిమెంట్... మద్రాస్ రెజిమెంట్. నీలగిరి కొండల్లోని వెల్లింగ్టన్‌లో దీని ప్రధాన కేంద్రం ఉంది. దీంట్లో మొత్తం 29 బెటా లియన్లు ఉన్నాయి. దక్షిణాది రాష్ట్రాలు మొత్తం అంటే సుమారు 27 కోట్లు లేదా దేశ జనాభాలో 22 శాతం మంది దీని పరిధిలోకి వస్తారు. మరోవైపు సిఖ్ రెజిమెంట్‌కు నియామకాలు 80 లక్షల జనాభానుంచి జరుగుతూంటాయి. ఈ రెజిమెంట్‌లో 24 పదాతిదళ బెటాలి యన్లున్నాయి. పంజాబ్ కేంద్రంగా ఉండే అన్ని రెజిమెంట్స్‌ను కలుపు కొంటే మొత్తం 74 బెటాలియన్లు ఉన్నాయి. మూడు కోట్ల మందినుంచి ఈ నియామకాలు జరుగుతాయి. దేశ రక్షణ కోసం ఏర్పాటైన వ్యవస్థలో ఈ రకమైన ప్రాతినిధ్యం ఎంత వరకూ సబబు? గ్రామీణ ప్రాంత యువతకు మేలైన ఉద్యోగావకాశం కల్పించే మిలిటరీలో అన్ని ప్రాంతాలకూ తగిన ప్రాతినిధ్యం కల్పించాలి.

పెట్టుబడులు ఎక్కువ అవసరమయ్యే ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలు రెండూ కేంద్రం నియంత్రణలోనే ఉండటంతో పాటు ఈ రంగంలోకి అడుగుపెట్టడం పెద్ద వ్యాపారవేత్తలకే సాధ్యమయ్యే పరిస్థితి. జనాభాలో ఎక్కువమందికి చేరువ కాగల అవకాశమున్న రేడియోపై కూడా పెత్తనం కేంద్రానిదే. ఇలా కాకుండా ఎఫ్‌ఎంబ్యాండ్లపై రేడియో ఛానళ్లు ఏర్పాటు చేసే అవకాశాన్ని స్థానికులకు కల్పించాలి. ప్రైవేట్, ప్రభుత్వ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలు పని చేస్తున్నప్పుడు... సమాచారం కోసం అత్యధికులు ఆధారపడే రేడియో ప్రైవేటు, రాష్ట్ర ప్రభుత్వ వనరులతో ఎందుకు నడవకూడదు? భారతదేశ ఏకత్వం అందరికీ సముచిత గౌరవమన్న దానిపై ఆధారపడి ఉండాలి. రాజకీయ భేదాలు ఎలా ఉన్నప్పటికీ రాష్ట్రాల న్నిటినీ భారత రాజ్యాంగం ఒక్కటిగా ఉంచుతోంది. అందరూ తమ గొంతు వినిపించేందుకు అవకాశం లభిస్తోంది. ఒక కేంద్రీకృత వ్యవస్థగా, ఏకస్వామ్యంగా మార్చేందుకు చేసే ఏ ప్రయత్నమైనా... అసలు ఉద్దేశాన్ని, సమాఖ్యను ముక్కలు చేస్తుంది. ' కొన్ని రాష్ట్రాల శక్తిని తగ్గించేదిగా ఉన్న పునర్విభజన ప్రకియను నిలిపివేయాలి. ప్రస్తుత పార్లమెంటరీ నియోజక వర్గాలను మార్చడంపై శాశ్వత నిషేధం విధించాలి. ' ప్రస్తుతం రాష్ట్రాలకు పన్నుల ఆదాయంలో 42 శాతం మాత్రమే లభిస్తోంది. ఈ పరిస్థితి మారాలి. వాటా క్రమేపీ 66 శాతానికి చేరాలి. ' విద్య మొత్తాన్ని రాష్ట్రాల జాబితాలోకి చేర్చడం మంచిది. రాష్ట్రాలపై ఏఐసీటీఈ, యూజీసీ వంటి సంస్థల పెత్తనానికి ఫుల్‌స్టాప్ పడాలి.

# సీఐడీ విచారణకు హాజరైన మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి



అమరావతి మార్చి 12 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

**ఏపీ సీఐడీ విచారణకు మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి హాజరయ్యారు. కాకినాడ పోర్టు అక్రమాల కేసులో ఆయన సీఐడీ కార్యాలయానికి వెళ్లారు. ఇదే కేసులో ఇప్పటికే విజయసాయిరెడ్డి ఈడీ విచారణకు హాజరయ్యారు.**

జగన్ హయాంలో కాకినాడ సీ పోర్ట్ లిమిటెడ్ (కేఎస్‌పీఎల్), కాకినాడ సెజ్ (కేసెజ్)ల్లో రూ.3,600 కోట్ల విలువైన వాటాలను వాటి యజమాని కర్నాటి వెంకటేశ్వరరావు (కేవీ రావు) నుంచి బలవంతంగా లాగేసుకున్న కేసులో వైకాపా మాజీ నేత, మాజీ ఎంపీ విజయసాయిరెడ్డికి ఏపీ సీఐడీ ఇటీవల నోటీసులిచ్చింది. బుధవారం ఉదయం విజయవాడ సీఐడీ ప్రాంతీయ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొంది. ఈ కేసులో విజయసాయిరెడ్డి రెండో నిందితుడు(ఏ2) కాగా, జగన్ బాబాయ్ వై.వి.సుబ్బారెడ్డి కుమారుడు విక్రాంత్‌రెడ్డి ఏ1గా ఉన్నారు. కేఎస్‌పీఎల్, కేసెజ్‌ల్లో వాటాలు లాగేసుకున్న వ్యవహారంలో మనీ లాండరింగ్ జరిగినట్లు గుర్తించిన ఈడీ.. మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద అభియోగాలు మోపి కేసు నమోదు చేసింది. రెండు నెలల కిందట సాయిరెడ్డిని ఈడీ విచారించింది. ఇదే వ్యవహారంలో సీఐడీ నోటీసులు ఇవ్వడంతో విజయసాయిరెడ్డి హాజరయ్యారు.

# వైసీపీ పాలనలో విశ్వవిద్యాలయాల ర్యాంకింగ్స్ పతనం - నారా లోకేష్

అమరావతి మార్చి 12 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల నాణ్యత దిగజారిందని, వైసీపీ ప్రభుత్వం వీసీల నియామకాల్లో పారదర్శకత పాటించలేదని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆరోపించారు. జగన్ మోహన్ రెడ్డి తన కుటుంబ సభ్యులను, పార్టీ అనుకూలులను వైస్ ఛాన్సలర్లుగా నియమించడం వల్ల ఉన్నత విద్యా ప్రమాణాలు పడిపోయాయని ఆయన మండిపడ్డారు. టీడీపీ హయాంలో ఉన్నత విద్యకు ప్రాధాన్యత ఇచ్చామని గుర్తుచేశారు.

**ర్యాంకింగ్స్ లో వెనుకబడిన రాష్ట్ర విశ్వవిద్యాలయాలు**

2014-2019 మధ్యకాలంలో రాష్ట్రంలోని 9 విశ్వవిద్యాలయాలు NIRF ర్యాంకింగ్స్ లో 200 లోపల ఉండేవని, ప్రస్తుతం ఆ సంఖ్య 5కి తగ్గిపోయిందని లోకేశ్ తెలిపారు. 2019లో 29వ ర్యాంకులో ఉన్న ఆంధ్ర విశ్వవిద్యాలయం (AU) ప్రస్తుతం 41వ స్థానానికి పడిపోయింది. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం (SVU) 72వ ర్యాంక్ నుంచి 100-150 మధ్యకు వెనుకబడింది. కొన్ని విశ్వవిద్యాలయాలు ర్యాంకింగ్‌కి ఎంపిక కాకపోవడం విచారకరమని ఆయన అభిప్రాయపడ్డారు.

**ఏపీ పిల్లల కోసం మోడల్ స్కూల్స్: మంత్రి నారా లోకేశ్**

పారదర్శకత లేని వీసీల నియామకాలు వైసీపీ ప్రభుత్వం వీసీల నియామకాల్లో రాజకీయ ప్రేరణతో వ్యవహరించిందని లోకేశ్ ఆరోపించారు. టీడీపీ హయాంలో ఐఐటీ ఖరగ్‌పూర్, ఎన్‌ఐటీ వరంగల్ వంటి ప్రముఖ సంస్థల్లో అనుభవం ఉన్నవారిని వీసీలుగా నియమించామని, అయితే ప్రస్తుత ప్రభుత్వం నాణ్యతను విస్మరించి నియామకాలు చేసిందని విమర్శించారు. పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీలోకి ఒక వైస్ ఛాన్సలర్‌ను తీసుకువెళ్లారని ఆయన గుర్తుచేశారు.



**విద్యారంగంలో సంస్కరణలు %-% పూర్వ వైభవం తీసుకురావాలని లక్ష్యం**

రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలకు పూర్వ వైభవం తీసుకురావడమే తమ ప్రభుత్వ లక్ష్యమని లోకేశ్ స్పష్టం చేశారు. విద్యాశాఖ బాధ్యతను స్వయంగా తీసుకోవడం వెనుక తన కృతనిశ్చయమే కారణమని ఆయన తెలిపారు. టీడీపీ ప్రభుత్వం గవర్నర్‌కి విశ్వవిద్యాలయాల ఛాన్సలర్ హోదాను తిరిగి అప్పగించిందని, ఇది విద్యా వ్యవస్థ పారదర్శకతను మెరుగుపరిచే నిర్ణయమని వివరించారు. విద్యారంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.



# పోసాని కృష్ణమురళి లంచ్‌మోషన్ పిటిషన్ కొట్టివేసిన హైకోర్టు

అమరావతి మార్చి 12 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

వైకాపా నేత, సినీనటుడు పోసాని కృష్ణమురళి దాఖలు చేసిన లంచ్ మోషన్ పిటిషన్‌ను ఏపీ హైకోర్టు కొట్టివేసింది. సీఐడీ దాఖలు చేసిన పీటీ వారెంట్‌ను కొట్టివేయాలని పోసాని దాఖలు చేసిన పిటిషన్‌పై ఉన్నత న్యాయస్థానంలో విచారణ జరిగింది. పోసానిని ఇప్పటికే పీటీ వారెంట్‌పై కర్నూలులో అదుపులోకి తీసుకున్నట్లు పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) కోర్టుకు తెలిపారు. మంగళగిరి మేజిస్ట్రేట్ ఎదుట పోసానిని ప్రవేశపెట్టేందుకు కర్నూలు నుంచి తీసుకొస్తున్నారని పీపీ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. వాదనలు విన్న ధర్మాసనం.. పోసాని లంచ్ మోషన్ పిటిషన్‌ను కొట్టివేసింది.

## జనసేన ఆవిర్భావ సభకు ‘జయకేతనం’ అనే పేరు

బహదూర్ పేరు పెట్టారు. రెండవ ద్వారానికి భవన నిర్మాణ కార్మికులకు సేవలందించిన దొక్కా సీతమ్మ పేరు, మూడవ ద్వారానికి విద్యా విస్తరణలో విశేష కృషి చేసిన మల్లాది సత్యలింగం నాయకర్ పేరు పెట్టారు. వారి సేవలను భావితరాలకు తెలియజేసే విధంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

**జనసేన విజయానికి గుర్తుగా జయకేతనం**

జనసేన పార్టీ రాష్ట్ర రాజకీయాల్లో గణనీయమైన విజయాన్ని సాధించిందని నాదెండ్ల మనోహర్ తెలిపారు. పోటీ చేసిన ప్రతి నియోజకవర్గంలో జనసేన అభ్యర్థులు విజయం సాధించారని, ఇది నాయకత్వ నైపుణ్యం, కార్యకర్తల త్యాగఫలం అని ఆయన పేర్కొన్నారు. ఈ విజయాన్ని పురస్కరించుకుని, పవన్ కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలియజేయడానికి, జనసైనికులకు ఉత్సాహం నింపడానికి ‘జయకేతనం’ సభను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. మార్చి 14న జరిగే ఈ సభలో సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఉంటాయని తెలిపారు.

## తెలుగుదేశం పార్టీ.. తెలుగింటి ఆడపడుచుల పార్టీ!

ఎంతో ఉంది. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో బాలికలకు సైకిళ్లు ఇచ్చి ప్రోత్సహించాము. దీపం 2 కింద ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. ఆర్టీసీలో పురుష కండక్టర్ల కంటే.. మహిళా కండక్టర్లే బాగా పనిచేస్తున్నారు’ అని సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు.

## చంద్రబాబు కృషితోనే పోలవరం ప్రాజెక్ట్‌కు భారీగా నిధులు

తెలిపారు. డయాఫ్రమ్ వాల్ పనులకు ప్రస్తుతం రెండు కట్టర్లను ఉపయోగిస్తూ.. 136 మీటర్ల పొడవున, 6700 చదరపు మీటర్లు నేటికి పూర్తి చేయడం జరిగింది అని చెప్పారు. ఏప్రిల్ మొదటివారం నుంచి డి వాల్ నిర్మాణానికి మూడో కట్టర్ కూడా అందుబాటులోకి రానుందన్నారు. 7 ఏళ్ల తరువాత నిర్వాసితుల బాధలను ఉపశమించడానికి.. కూటమి ప్రభుత్వం 990 కోట్ల రూపాయలను ఒకే విడతగా వారి వారి ఖాతాల్లో జమ చేయడం జరిగింది అని నీటిపారుదల శాఖ మంత్రి రామానాయుడు పేర్కొన్నారు.

# వైట్‌హౌస్‌కు టెస్లా 'షోరూం'

## ఇచ్చిన మాట ప్రకారం కారు కొన్న ట్రంప్

**వాషింగ్టన్: ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ నేతృత్వంలోని డోజ్ శాఖ నిర్ణయాల వల్ల అమెరికా వ్యాప్తంగా ఆయనపై తీవ్ర వ్యతిరేకత వస్తోంది. ఈక్రమంలోనే మస్క్‌కు చెందిన టెస్లా కార్లను బహిష్కరించాలని పెద్దఎత్తున డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఈ పరిణామాల వేళ ప్రపంచ కుబేరుడికి మద్దతుగా నిలిచిన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. తానే స్వయంగా టెస్లా కారును కొంటానని మాటిచ్చారు. అన్నట్లుగానే తాజాగా ఆయన ఆ విద్యుత్ వాహనాన్ని కొనుగోలు చేశారు. అయితే, ఇందుకోసం ఆ కంపెనీ అధినేత ఎలాన్ మస్క్ ఏకంగా ఐదు కార్లను వైట్‌హౌస్‌కు తీసుకురావడం విశేషం. అందులో నుంచి ఎరుపు రంగు కారును ట్రంప్ కొనుగోలు చేశారు.**



మస్క్ ఓ గొప్ప అమెరికన్ అని, దేశభక్తుడని ట్రంప్ నిన్న తన పోస్ట్‌లో రాసుకొచ్చిన సంగతి తెలిసిందే. టెస్లా ప్రపంచంలోని గొప్ప ఆటోమేకర్ అని, ఆ సంస్థ వాహనాన్ని తాను కొనుగోలు చేస్తానని ప్రకటించారు. ఈనేపథ్యంలో టెస్లా (%వంశ్రీఖ%) అధినేత మంగళవారం (అమెరికా కాలమానం ప్రకారం) ఐదు వాహనాలను శ్వేతసౌధానికి తీసుకొచ్చారు. వీటి ఫీచర్ల గురించి అధ్యక్షుడికి మస్క్ స్వయంగా వివరించారు.

అనంతరం ఎరుపు రంగు కారు డ్రైవింగ్ సీట్లో ట్రంప్ కూర్చుని.. 'ఇది చాలా అందంగా ఉంది' అని వ్యాఖ్యానించారు.


పక్కనే ప్యాసింజర్ సీట్లో ఉన్న మస్క్.. 'ఇది వేగంగా వెళ్లే కారు. సీక్రెట్ సర్వీస్‌కు ఓసారి హార్ట్‌ఎటాక్ ఇద్దామా?' అని సరదాగా జోక్ చేశారు. అయితే, వాహనాన్ని నడిపేందుకు ట్రంప్‌నకు అనుమతి లేనందున ఆయన టెస్ట్ డ్రైవ్‌కు వెళ్లలేదు. అనంతరం వీరిద్దరూ మీడియాతో మట్లాడారు. "ఈ కారును నేను పూర్తి ధర అయిన 80వేల డాలర్లకు కొనుగోలు చేశాను. మస్క్ నాకు దీనిపై డిస్కౌంట్ ఇచ్చేవారే..! కానీ, ఒకవేళ నేను రాయితీ తీసుకుంటే.. ఎన్నో ప్రయోజనాలు పొందానని వారు (ప్రతిపక్షాలు) విమర్శలు చేస్తారు. ఆయన కార్లు తీసుకొచ్చారు. నేను మీడియా ఎదుటే ఒకటి కొనుగోలు చేశాను. ఇదంతా పబ్లిక్‌గానే జరిగింది" అని అధ్యక్షుడు అన్నారు.

ట్రంప్ పాలకవర్గంలో డోజ్ అధినేతగా మస్క్ బాధ్యతలు అందుకున్న నాటినుంచి టెస్లా షేర్లు కుదేలవుతున్నాయి. గత నెల మొత్తంలో షేరు విలువ 30శాతం పడిపోగా.. ఒక్క సోమవారమే 15శాతానికి పైగా పతనమైంది. అటు కంపెనీ విక్రయాలు కూడా పడిపోయాయి. ఈ పరిణామాల వేళ ట్రంప్ టెస్లా కారు కొనుగోలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

### అమెరికాలోని భారతీయులకు

# రాయబార కార్యాలయం అడ్వైజరీ

**అమెరికా : అమెరికాలోని భారతీయులకు అక్కడి రాయబార కార్యాలయం అడ్వైజరీ జారీ చేసింది. భారత రాయబార కార్యాలయం పేరుతో నకిలీ కాల్స్ వస్తున్న నేపథ్యంలో భారతీయులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యక్తిగత సమాచారం, క్రెడిట్ కార్డు వివరాలు వెల్లడించవద్దని పేర్కొంది. పాస్‌పోర్టు, ఇమిగ్రేషన్ ఫారమ్, వీసాలో తప్పులు ఉన్నాయని చెబుతూ సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసగించే అవకాశం ఉందని హెచ్చరించింది.**





ఈ లోపాలను సవరించడానికి డబ్బు చెల్లించాలని పేర్కొంటూ సైబర్ నేరగాళ్లు భారతీయ పౌరుల నుంచి డబ్బు వసూలు చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు వెల్లడించింది. ఈ లోపాలను సరిదిద్దుకోకపోతే ప్రస్తుతం అమెరికా పాటిస్తున్న నిబంధనల ప్రకారం తిరిగి భారత్‌కు పంపించివేస్తామని.. లేదంటే జైలు శిక్ష విధిస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నట్లు పేర్కొంది. అటువంటి కాల్స్ వస్తే భయపడకుండా తమకు సమాచారం అందించాలని సూచించింది.

అమెరికాలోని భారత పౌరులతో పాటు.. పలువురు వీసా దరఖాస్తుదారులకు ఇటువంటి మోసపూరిత కాల్స్ వచ్చినట్లు తమకు ఫిర్యాదులు అందాయని అన్నారు. ఈ నేపథ్యంలో హెచ్చరికలు జారీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. భారత రాయబార కార్యాలయానికి సంబంధించిన అధికారులెవరూ ప్రజల వ్యక్తిగత సమాచారం కోరుతూ ఫోన్‌కాల్స్ చేయరని.."mea.gov.in" అనే అధికారిక మెయిల్ ద్వారానే సంప్రదిస్తారని అన్నారు. ఈ విషయంలో భారతీయులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అక్రమ వలసదారులపై మొదటినుంచి కఠినంగా ఉంటున్నారు. ఇటీవల ఆయన రెండోసారి అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం వారిని దేశం నుంచి తిరిగి పంపించే ప్రక్రియను వేగవంతం చేశారు. ఈక్రమంలోనే యూఎస్‌లోకి అక్రమంగా ప్రవేశించిన, సరైన పత్రాలు లేని భారతీయులను, ఇతర దేశీయులను సైనిక విమానంలో వెనక్కి పంపివేశారు.

# భార్య ఉషతో కలిసి.. త్వరలో భారత పర్యటనకు జేడీ వాన్స్..!

**న్యూయార్క్: అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ అతి త్వరలో భారత పర్యటనకు విచ్చేయనున్నట్లు తెలుస్తోంది. భార్య ఉష చిలుకూరితో కలిసి ఈ నెలాఖరు లేదా వచ్చే నెల ఆరంభంలో భారత్‌కు రానున్నారట. ఈమేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ అమెరికా మీడియా కథనాలు వెల్లడించాయి. ఉపాధ్యక్ష బాధ్యతలు అందుకున్న తర్వాత వాన్స్ చేపడుతున్న రెండో విదేశీ పర్యటన ఇదే కానుంది. గత నెల ఆయన ఫ్రాన్స్, జర్మనీ దేశాలకు వెళ్లారు. తెలుగు మూలాలున్న ఉష సెకండ్ లేడీ హోదాలో తన పూర్వీకుల దేశానికి రానుండటం ఇదే తొలిసారి.**



ఉష చిలుకూరి అమెరికాలో పుట్టిన తెలుగమ్మాయి అన్న సంగతి తెలిసిందే. ఆమె పూర్వీకులది ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా పామర్రుకి దగ్గర్లోని ఓ కుగ్రామం. తల్లిదండ్రులు రాధాకృష్ణ, లక్ష్మి 1980ల్లోనే అమెరికా వలసవెళ్లారు. కాలిఫోర్నియాలోని శాండియాగో ప్రాంతంలో ఉషా చిలుకూరి పుట్టి పెరిగారు. యేల్ యూనివర్సిటీ నుంచి చరిత్రలో బ్యాచిలర్ డిగ్రీ పొందారు. కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయం నుంచి తత్వశాస్త్రంలో మాస్టర్స్ పూర్తి చేశారు. న్యాయ సంబంధమైన విభాగాల్లో సుదీర్ఘకాలం పనిచేశారు.

యేల్ లో ఉషా, జేడీ వాన్స్ (%జీణ ఖుఅవెవ%) తొలిసారి కలుసుకున్నారు. వారి పరిచయం ప్రేమగా మారి.. 2014లో కెంటకీలో వారు వివాహం చేసుకున్నారు. హిందూ సంప్రదాయంలో వీరి వివాహం జరగడం విశేషం. వీరికి ముగ్గురు సంతానం. రాజకీయాల్లో వాన్స్‌కు ఉష అడుగడుగునా అండగా నిలబడ్డారు. గతేడాది ఎన్నికల సమయంలోనూ వాన్స్ తరఫున చురుగ్గా ప్రచారం చేసి ఆమె మీడియా దృష్టిని ఆకర్షించారు.

## మున్సిపల్ శాఖ మంత్రి నారాయణకు వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్ పి.వి.



**సింహాచలం మార్చి 12 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

98 వ వార్డు కార్పొరేటర్ పి.వి.నరసింహం ఆస్తులు కోల్పోయిన బాధితులకు టి.డి.ఆర్ .లు జారీ చెయ్యాలని మునిసిపల్ శాఖ మంత్రి నారాయణకు వినతిపత్రం అందజేశారు . సింహచలం బి.అర్.టి.ఎస్ . కారిడార్ విస్తరణలో బాగంగా పాత గోశాలనుండి పాత అడవివరం వరకు ఆస్తులు కోల్పోయిన నిర్వాసితులకు టి.డి.ఆర్ .లు జారీచేయాలని కార్పొరేటర్ పి.వి.నరసింహం , 98 వ వార్డు అధ్యక్షులు పంచదార్ల శ్రీనివాసు సమస్యను మంత్రి దృష్టికి తీసుకువచ్చి సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు . జగన్ ప్రభుత్వంలో హడావుడిగా విస్తరణ జరిపి బాదితులను గాలికొదిలేశారని పి.వి.తెలిపారు . తక్షణం బాదితుల సమస్యను పరిష్కరించాలని కోరారు . అందుకు మంత్రి నారాయణ మాట్లాడుతూ ఇప్పటికే చాలా సమస్యలు క్యాబినెట్ లో చర్చించి పూర్తి స్థాయిలో న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు .

## త్రిభాషా విధానాన్ని ఎన్నటికీ అంగీకరించం: స్టాలిన్



**చెన్నై(ఆర్కేనగర్) : త్రిభాషా విధానాన్ని ఎన్నటికీ అంగీకరించబోమని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ స్పష్టం చేశారు. ఆయన చెంగల్పట్టులో మంగళవారం జరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.**

అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ.. "త్రిభాషా విధానంలో హిందీ, సంస్కృతాన్ని అంగీకరిస్తేనే తమిళనాడుకు రూ.2వేల కోట్లు ఇస్తామని ఎవరు పొగరుగా సమాధానమిస్తున్నారు? పార్లమెంట్‌లో ధర్మేంద్ర ప్రధాన్ మాటలను అరగంటలో వెనక్కి తీసుకునేలా చేసిన రాష్ట్ర ఎంపీల పోరాటానికి అభినందనలు' అని తెలిపారు.

## పిల్లల్ని కనండి.. కానీ..: ఉదయనిధి స్టాలిన్



**తమిళనాడు : లోక్‌సభ నియోజకవర్గ పునర్విభజన విషయంలో తమిళనాడు గత కొంతకాలంగా కేంద్రంపై విమర్శలు గుప్పిస్తోన్న సంగతి తెలిసిందే. జనాభా ప్రాతిపదికన మాత్రమే నియోజకవర్గాలను నిర్ణయిస్తే.. రాష్ట్రంలో లోక్‌సభ స్థానాలు తగ్గుతాయని అక్కడి నేతలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ నేపథ్యంలో తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పుట్టిన రోజు (మార్చి 1న) వేడుకల్లో భాగంగా ఉదయనిధి 72మంది జంటలకు సామూహిక వివాహాలు జరిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..కొత్తగా పెళ్లయిన జంటలు అత్యవసరంగా పిల్లల్ని కనాలని కోరారు. అయితే ఎక్కువ మందిని మాత్రం కనొద్దని సూచించారు.**

"2026 తర్వాత అమల్లోకి వచ్చే ఈ డీలిమిటేషన్ ప్రక్రియ జనాభా ఆధారంగా పార్లమెంటరీ నియోజకవర్గాలను తిరిగి రూపొందిస్తుంది. రాష్ట్రాల్లోని జనాభాకు సరైన ప్రాతినిధ్యం లభించేలా పార్లమెంటులో, అసెంబ్లీల్లో సీట్లుండేలా చూసే ప్రక్రియలో ఎక్కువ సీట్లు ఇవ్వాలంటే.. కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు జనాభా సంఖ్యను పర్యవేక్షిస్తోంది. తమిళనాడుతో సహా దక్షిణాది రాష్ట్రాలు దశాబ్దాలుగా జననాల రేటును నియంత్రిస్తూ వస్తున్నాయని..దీని మూలంగాపార్లమెంటరీ ప్రాతినిధ్యంలో వాటి వాటా తగ్గే అవకాశం ఉంది" అని స్టాలిన్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం తమిళనాడు నుంచి 39 మంది ఎంపీలు ఉన్నారని.. రాష్ట్ర జనాభా 7 కోట్లు కాబట్టి, డీలిమిటేషన్ ప్రక్రియ అమల్లోకి వస్తే ఆ సంఖ్య 31కి తగ్గుతుందని ఆయన అన్నారు. అయితే ఎక్కువ జనాభా ఉన్న ఉత్తరాది రాష్ట్రాలు మాత్రం 100కు పైగా సీట్లు పొందే అవకాశం ఉందని పేర్కొన్నారు.




డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

తెలుగురాష్ట్రం దినపత్రిక

https://epaper.teluguraastram.com

గురువారం 13 మార్చి 2025

## నరసాపురం బైపాస్ రోడ్డు భూ సేకరణ వేగవంతం చేయండి





**అమలాపురం, మార్చి 12 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

నరసాపురం బైపాస్ రోడ్డు భూ సేకరణ పనులు త్వరితగతిన పూర్తి చేసి జాతీయ రహదారులు వారు రహదారి అభివృద్ధికి టెండర్లు జారీ చేసేందుకు వీలుగా అప్పగించాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం అమలాపురం ఆర్డీవో జాతీయ రహదారులు ఇంజనీర్లు, మల్కిపురం సఖినేటిపల్లి తాసిల్దార్లతో సమావేశం నిర్వహించి భూసేకరణ ప్రక్రియ అవార్డులు పాస్ చేయడం నష్టపరిహారాలు చెల్లింపు, భూములు సేకరణ అప్పగింత, కోర్టు కేసులు పెండింగ్ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 98% భూసేకరణ ప్రక్రియ పూర్తయిందని తెలిపారు గుడిమెల్ల%శీ%క గ్రామంలో ఒక రైతు 2023 సెప్టెంబర్ లో తమ పొలం మధ్యలో బైపాస్ రోడ్డు వస్తున్నందున నష్టపరిహారాన్ని పెంచి ఇవ్వాలని కోర్టులో కేసు పెండింగ్లో ఉందని ఇంకా వాదనల స్థాయికి రాలేదని అధికారులు ఇంజనీర్లు జిల్లా కలెక్టర్ వారి దృష్టి కి తెచ్చారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి నిషా%శీ%తి అమలాపురం ఆర్డీవో కే మాధవి జాతీయ రహదారులు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి నిక్కి క్రెజ్ సఖినేటిపల్లి తాసిల్దార్ వెంకటేశ్వర రావు మల్కిపురం తాసిల్దారు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## హిందూధర్మానికి ఆధ్యాత్మిక శోభ విరజిల్లెల దేవాలయాలను పునర్దించండి




**అమలాపురం, మార్చి 12 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సనాతన హిందూధర్మానికి అద్దం పట్టే విధంగా ఎన్నో దేవా లయాలకు నిలయంగా ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లుతోందనీ జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ వెల్లడించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లో జిల్లాలోని ఐదు వేలు భక్తులు సందర్శించుకునే ఉత్సవ దేవాలయాల వివరాలపై జిల్లా కలెక్టర్ అధ్యక్షతన రెవెన్యూ దేవాలయ శాఖ, పోలీసు అధికారులతో సమీక్షించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సనాతన హిందూ ధర్మం పరిఢవిల్లే రీతిలో ఉన్న17 ముఖ్య దేవ స్థాన ఆలయాలలో ఉత్సవాల సందర్భంగా 5 వేలు మంది భక్తులు పాల్గొనే అవకాశం ఉందని తెలిపారు ఉత్సవాలపై ఏప్రిల్ ఒకటి నుండి మార్చి 31 వరకు వార్షిక క్యాలెండర్ను రూపొందిం చాలని దేవస్థాన అధికారులను ఆదేశించారు. ఆ ప్రకారం ఒక నెల ముందుగా ఉత్సవాలు సన్నద్ధత చర్యలపై జిల్లా స్థాయి లో సమావేశాన్ని నిర్వహించి పటిష్టమైన ఏర్పాట్లు గైకొనడం జరుగుతుందన్నారు ఆ ఉత్సవ నిర్వహణకు అవసరమైన నిధులు, శాంతి భద్రతల పరిరక్షణ సెక్యూరిటీ ఏర్పాట్లు అంశాలపై ఇకపై జిల్లా జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన ఉత్సవాల నిర్వహణకై " జిల్లా భక్తులు యాత్రికుల సేఫ్టీ కమిటీ" ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ నిధులు సరిపోను పక్షంలో అదనపు నిధులు కమిటీ ద్వారా కోరాల్సి ఉంటుందని అలాగే ఇతర శాఖల సహకారాన్ని పొందాల్సి ఉంటుందన్నారు జిల్లాలో ప్రతి ఉత్సవాన్ని సమర్థ వంతంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు వీలుగా ఈ కమిటీ విధివిధానాలను రూపొందించి క్షేత్రస్థాయిలో పటిష్టంగా అమలుపరుస్తూ భక్తుల కు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు చేపడుతుందన్నారు అదేవిధంగా జిల్లాలో ప్రధానంగా ఐదు ముఖ్య దేవాలయాలైన అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహ స్వామి కల్యాణోత్సవం ద్రాక్షారామ భీమేశ్వర స్వామి శివరాత్రి ఉత్సవాలు వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి వార్షిక తీర్థ కళ్యాణ మహోత్సవాలు, అయినవిల్లి శ్రీ సిద్ధి వినాయక స్వామి ఉత్సవాలు, అప్పనపల్లి బాల బాలాజీ దేవస్థానం ఉత్సవాలు ఏర్పాట్లపై మాస్టర్ ప్లాన్ ను దేవా దాయ రెవెన్యూ అధి కారులు దేవాలయ నిర్మాణ స్థితిగతులు చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, పార్కింగ్ ఉత్సవాల నిర్వహణ తదితర ప్రాధాన్యతగా రానున్న 25 సంవత్సరాలకుగాను దీర్ఘకాలిక కార్యనిర్వహక మాస్టర్ ప్లాన్ రూపొందించాలని ఆదేశించారు. ఉత్సవాల నిర్వహణాలో భక్తుల సౌకర్యార్థం కంపార్ట్మెంట్లు భక్తుల దైవదర్శన ఏర్పాట్లు వాహనాలు రాకపోకలు భక్తుల రద్దీ నియంత్రణ తదితర చర్యల పర్యవేక్షణకు కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టాలని ఆదేశించారు. ఇకపై వార్షిక క్యాలెండర్ ప్రకారం ఉత్సవాల నిర్వ హణ సన్నద్ధతపై కమిటీ సభ్యులు పర్యవేక్షిస్తారని ఆయన స్పష్టం చేశారు ఆ ప్రకారం ఉత్సవాలను దిగ్విజయంగా నిర్వహించేందుకు శాఖల సమన్వయంతో వ్యవహరించా లని ఆయన స్పష్టం చేశారు. అదేవిధంగా పోలీస్ అధికారులు సూచించిన భైరవపాలెం మాగసాని తిప్ప మావుళ్ళమ్మ జాతర ఉత్సవాల నిర్వహణపై కూడా ఇకపై పటిష్టమైన ఏర్పాట్లు కమిటీ పర్యవే క్షణలో చేపడతామని తెలిపారు. జిల్లా జాయిం ట్ కలెక్టర్ మాట్లాడుతూ ఉత్సవాలు నిర్వహినకై ఈవెంట్ల వారీగా చెక్ లిస్టులు, ఆగమన శాస్త్ర ప్రకారం ఏర్పాట్లు ఉండా లని, ప్రతి అంశానికి మినిట్స్ ప్రొసీడింగ్స్ ఉండాలని ఏర్పాట్లపై సమగ్ర మైన కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చే యాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ కే మాధవి, అడిషనల్ ఎస్పీ ఏవిఆర్పిబి ప్రసాద్ డి.ఎస్.పి, టిఎస్ఆర్కే ప్రసాద్ దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి సత్యనారాయణ వివిధ దేవస్థానాల కార్యనిర్వాహక అధికారులు తదితరులు పాల్గొన్నారు

# అసంపూర్తిగా నిలిచిపోయిన గృహాలకు నిధులు మంజూరు




**అమలాపురం, మార్చి 12 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో అసంపూర్తిగా నిలిచిపోయిన గృహ నిర్మాణాలను పూర్తి చేయు నిమిత్తం 10,767 మంది లబ్ధిదారులకు రూ 6 కోట్ల,53 లక్షలు అదనపు ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం ప్రకటించిందని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ వెల్లడించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ నందు గృహ నిర్మాణ సంస్థ ఇంజనీర్లతో సమావేశం నిర్వహించి ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల మేరకు ఆన్లైన్ సర్వే ప్రక్రియపై లబ్ధిదారులకు అవగాహన అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసంపూర్తిగా ఉన్న గృహ నిర్మాణాల కోసం అదనపు ఆర్థిక సహాయం అందించడం జరుగు తుందని తెలిపారు షెడ్యూల్ కులాల వారికి వెనుకబడిన తరగతుల వారికి రూ.50 వేలు, గిరిజన తెగల వారికి రూ.75 వేలు చొప్పున ఆర్థిక సహాయం అంది స్తారన్నారు స్వర్ణ ఆంధ్ర 2047 విజన్ సాకారంలో భాగంగా 2029 నాటికి అందరికీ ఇల్లు ఏర్పర చాలనే ధృఢ నిశ్చయంతో అసంపూర్తి ఇళ్ల నిర్మా ణాల పూర్తికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఇందు లో భాగంగా ప్రధానమంత్రి ఆవాస్ యోజన 1.0 లో ఇల్లు మంజూరై, ఇంకనూ వివిధ కారణాల మూలం గా వివిధ దశలలో నిర్మా ణంలో ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీలకు యూనిట్ విలువకు అదనంగా ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వం సంకల్పించింద న్నారు. యూనిట్ పెట్టుబడి సరిపోలేదని పలుమార్లు లబ్ధిదారుల విజ్ఞాపనలతో స్పందించిన ప్రభుత్వం అదనపు సహాయాన్ని ప్రకటించినదన్నారు.ఇందులో భాగంగా ప్రభుత్వ ఉత్తర్వులు జివో నెంబర్.9 తేది 10.03.2025 విడుదల చేయడమైనదన్నారు. జిల్లాలో సుమారుగా 2016 నుండి2021 ఆర్థిక సంవత్సరం వరకు పి ఎం ఏ వై 1.0 గ్రామీణ్, అర్బన్ పథకాలలో 10,767 మంది బీసీ, ఎస్సీ, ఎస్టీల గృహాలు వివిధ దశలలో నిర్మా ణాలు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. బి.సి. లు ఎస్సీ వర్గాలకు సంబంధించి జిల్లాలో 10,603 లబ్ధిదారుల గృహాలు అసంపూర్తిగా నిలిచాయని, గిరిజన తెగలకు సంబంధించి 164 మంది గృహాలు అసంపూర్తిగా ఉన్నట్లు గుర్తించడం జరిగిం దన్నారు. గృహనిర్మాణం పూర్తికి యూనిట్ విలువ రూ.1.80 లక్షలకు అద నంగా ఎస్సీలు, బీసీలు అందరికీ రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, చొప్పున ఆర్థిక సహాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అదనంగా అందిస్తుందని తెలిపారు, అయితే వీటి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలన్నారు. నిర్మాణం పూర్తి చేసుకొనే దశల వారీగా అదనపు మొత్తాన్ని లబ్దిదారుల ఖాతాకు నేరుగా జమ చేస్తార న్నారు. ఈ మేరకు లబ్దిదారులు ఇల్లు పూర్తి చేసుకోవడానికి తక్షణమే అవసర మైన చర్యలు తీసుకోవాలని గృహ నిర్మాణ సంస్థ పథక సంచాలకులు ఎంవి నరసింహారావును జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అలాగే గృహ నిర్మాణ సిబ్బంది, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వార్డు ఎమె నిటిస్, ఎంపిడివోలు, మున్సిపల్ కమీషనర్లు ఈ విషయాన్ని విస్తృ తంగా ప్రచారం చేసి లబ్దిదారులు త్వరిత గతిన ఇండ్ల నిర్మాణం పూర్తి చేసుకునేలా సమన్వయంతో కృషి చేయాలన్నారు. ఇండ్ల నిర్మాణం పూర్తి చేసుకోవడంలో నిధుల మంజూరు కొరకు మధ్యవర్తులు, ఇతరులు మోసపూరిత మాటలు నమ్మరాదని, ఏమైన సమస్యలు ఉన్న యెడల సంబంధిత మండల గృహ నిర్మాణ కార్యాలయం ఎంపిడివో, మున్సిపల్ కమీషనర్లను సంప్రదించాలన్నారు. కావున లబ్దిదారులు అందరు ప్రభుత్వం అందిస్తున్న ఈ అదనపు ఆర్థిక లబ్ది సదవకాశాన్ని వినియోగించుకొని తమ సొంత ఇంటి కల సాకారం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఇంజనీ రింగ్ అసిస్టెంట్లకు లాగిన్లు ఇస్తూ లక్ష్యాలు నిర్దేశించి సర్వే ప్రక్రియను వారంలో పూర్తి చేయాల ని ఆదేశించారు. కుల ధ్రువీకరణ లేని లబ్ధి దారులకు గ్రామ వార్డు సచివాలయం ద్వారా కుల ధ్రువీకరణ జారీకి చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ సంస్థ పిడి ఎంవి నరసింహారావు డి ఎల్ డి వో రాజేశ్వరరావు, జి ఎస్ డబ్ల్యూ ఎస్ కోఆర్డినేటర్ సువిజయ్ డిఈలు ఏఈలు తదితరులు పాల్గొన్నారు.



## బోధనా సామర్థ్యాలను మెరుగుపర్చేందుకే టీచ్ టూల్ అబ్జర్వేషన్

### ఈ నెలాఖరుతో టీచ్‌టూల్ అబ్జర్వేషన్స్ ముగింపు - ఎల్ఎఫ్ఈ స్టేట్ అసోసియేట్ డైరెక్టర్ నేహా నాయర్



**ఐ.పోలవరం మార్చి 12 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఉపాధ్యాయుల్లో బోధనా సామర్థ్యాలను మెరుగు పర్చేందుకే టీచ్ టూల్ అబ్జర్వేషన్స్ పాఠశాలల్లో చేపట్టినట్లు లీడర్‌షిప్ ఫర్ ఈక్విటీ(ఎల్ఎఫ్ఈ) స్టేట్ అసోసియేట్ డైరెక్టర్ నేహా నాయర్ తెలిపారు. ఐ.పోలవరం మండలం మురముళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలను నేహానాయర్‌తో పాటుగా, ఎల్ఎఫ్ఈ సీనియర్ ప్రోగ్రామ్ మేనేజరు టి.విజయ, సమగ్ర శిక్షా అకడమిక్ మానిటరింగ్ అధికారి పి.రాంబాబుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా నేహా నాయర్ మాట్లాడుతూ రాష్ట్రంలో 1,88.269 అబ్జర్వేషన్స్ పూర్తయ్యాయన్నారు. ఉపాధ్యాయుల టీచింగ్ విధానాన్ని 11, 117 మంది శిక్షణ పొందిన టీచ్‌టూల్ అబ్జర్వర్స్ వారి అబ్జర్వేషన్స్ చేపట్టారన్నారు. 73,868 టీచర్స్ బోధనా శైలిని పరిశీలించడం జరిగిందన్నారు. ప్రస్తుత అకడమిక్ విద్యా సంవత్సరంలో మార్చి నెలాఖరుల నాటికి 24,094 మంది టీచర్స్‌ను అబ్జర్వేషన్ చేయాల్సి ఉందన్నారు. టీచ్ టూల్ విధానంలో ఉపాధ్యాయుల బోధనా పద్ధతులను అబ్జర్వర్స్ పరిశీలించి, టీచ్ టూల్ అబ్జర్వేషన్ మాన్యువల్‌కు అనుగుణంగా ఉందా? లేదా? అనే విషయాలను పరిశీలించి, డేటాను ఆన్‌లైన్ పొందుపరుస్తారన్నారు. ఈ డేటా ఆధారంగా ఉపాధ్యాయులు వారి బోధనా పద్ధతులను మెరుగుపర్చుకునేందుకు అనుగుణంగా టీచింగ్ మెథడ్స్‌ను రూపొందిస్తామన్నారు. డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 425 మంది ఏక్టివ్ అబ్జర్వర్స్ ఉండగా 5,796 అబ్జర్వేషన్స్ పూర్తి ఏఎంవో రాంబాబు తెలిపారు. 35 మంది ఇన్‌ఏక్టివ్ అబ్జర్వర్స్‌ను ఏక్టివ్ అబ్జర్వర్స్‌గా మారాల్సి ఉందన్నారు. బోధనా పద్ధతుల్లో మరిన్ని మెరుగైన పద్ధతులను తీసుకుని వచ్చేందుకు, కాంప్లెక్స్ సమావేశాలను మరింత మెరుగ్గా తీర్చిదిద్దేందుకు క్షేత్ర స్థాయిలో కాంప్లెక్స్‌ల పనితీరును పరిశీలిస్తున్నట్లు ఎల్ఎఫ్ఈ ప్రోగ్రామ్ మేనేజరు టి.విజయ తెలిపారు. వారి వెంట ఎల్ఎఫ్ఈ తూర్పుగోదావరి, కోనసీమ జిల్లా కోఆర్డినేటర్లు ఆషిక్ ఆలీ బేగ్, వివేక్‌లు ఉన్నారు.

## (పీ4) క్యూఆర్ కోడ్ కలిగిన గోడ పత్రికను ఆవిష్కరణ



**అమలాపురం, మార్చి 12 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా ప్రభుత్వ దాతల ప్రజల భాగ స్వామ్యంతో(పీ4) ప్రతి ఇంటికి అభివృద్ధి ప్రతి జీవితానికి ప్రగతిని సాధించే దిశగా స్వర్ణాంధ్ర ఏ2047 దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేసిందని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ తెలిపారు. బుధవారం ఆయన ప్రభుత్వ దాతల ప్రజల భాగస్వామ్యం (పీ4) క్యూఆర్ కోడ్ తో కలిగిన గోడ పత్రికను స్థానిక కలెక్టరేట్ నందు ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం సమాజంలో ఉన్న 20 శాతం అత్యంత నిరుపేదల అభ్యున్నతికి పి ఫోర్ మోడల్ ప్రభుత్వ దాతల ప్రజల భాగస్వా మ్యం ద్వారా టాప్ 10 శాతంలో ఉన్న తెలుగు ప్రవాస భారతీ యులు అధిక సంపన్న వ్యక్తుల సహకారంతో పేదరికం లేని సమాజాన్ని సాధించడానికి శ్రీకారం చుట్టిందన్నారు దీనిపై ప్రజాభిప్రా య సేకరణకై ఈ నెల తొమ్మిదో తేదీ నుండి 25వ తేదీ వరకు క్యూఆర్ కోడ్ ఓపెన్ చేసి అభిప్రాయాలను తెలియ జేయవచ్చునని ఆయన ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నిశాంతి, ఆర్డిఓ మాధవి సిపిఓ వెంకటేశ్వర్లు సిబ్బంది శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ హరిత ట్రిబ్యునల్ నిబంధనలకు విరుద్ధంగా సాగు చేస్తున్న చెరువులను తొలగించండి




**అమలాపురం, మార్చి 12 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

జాతీయ హరిత ట్రిబ్యునల్ నిబంధనలకు విరుద్ధంగా ఉన్న 438 ఆక్వా చేపల చెరువులను త్వరితగతిన ధ్వంసం చేయాలని జిల్లా కలెక్టర్ మత్స్య రెవెన్యూ అధికారులను ఆదేశించారు.బుధవారం స్థానిక కలెక్టరేట్ నందు జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆంక్షలు విధించిన చెరువులలో ఇప్పటి వరకు 84 చెరువుల మాత్రమే ధ్వంసం చేయడం జరిగిందని మిగిలిన 354 చెరువులను ఏప్రిల్ 15 నాటికి పూర్తిగా ధ్వంసం చేసి నోటీసుల ద్వారా సంబంధిత రైతులకు పర్యావరణ జరిమానగా ఎకరాకు రూ 10 వేలు నీటి కాలుష్యానికి మరో రూ 10 వేలు చెల్లించాలని సూచించాలన్నారు. చెరువులు ధ్వంసానికి అవసరమైన జెసిబిలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ధ్వంసం చేసిన చెరువులు మరల పునరుద్ధరణకు ఆస్కారం లేకుండా చర్యలు చేపట్టా లని లేని పక్షంలో సంబంధిత విఆర్ఓ ఎఫ్ డి వో లు పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ బి కృష్ణారావు జాయింట్ కలెక్టర్ టి నిశాంతి, మత్స్యశాఖ జీడి ఎం శ్రీనివాసరావు, కాలుష్య నియంత్రణ మండలి కార్యనిర్వహరణ ఇంజనీర్ శంకర్రావు, తాసిల్దార్లు (మామిడి కుదురు) సుబ్రహ్మణ్యా చారి, మల్కిపురం శ్రీనివాసరావు, సఖినే టిపల్లి వెంకటేశ్వరరావు ఎఫ్డిఓ లు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఫ్యాట్స్ పెన్నులు పంపిణీ

**ఐ.పోలవరం మార్చి 12 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



ఐ.పోలవరం ,మురమళ్ల ప్రభుత్వ పాఠశాల లోపదవ తరగతి చదువుతున్న విద్యార్థిని,విద్యార్థులకు హైదరాబాద్ క్షత్రియ యూత్ ఫెడరేషన్ ఆద్వర్యంలో ఎగ్జామ్ ఉపకరణలు ప్యాడ్, కంపాస్ బాక్స్ పెన్స్ లను ముమ్మిడివరం శాసనసభ్యులు ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు చేతుల మీదుగా అందజేశారు. ఆయన మాట్లాడుతూ పదో తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు మంచి ఫలితాలను సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. మంచి సేవా కార్యక్రమాలను చేస్తున్న క్షత్రియ యూత్ ఫెడరేషన్ అభినందించారు. ఈ కార్యక్రమంలో సాగిరాజు సూరిబాబు రాజు, కాకర్లపూడి రాజేష్ , జంపన బాబు, గంజా సుధాకర్, నంబూరి సీతారామరాజు ,నాయకులు పాల్గొన్నారు.

## ఎంపీపీ కుటుంబానికి మాజీ మంత్రి విశ్వరూప్ పరామర్శ



**కాట్రేనికోన మార్చి 12 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

కాట్రేనికోన మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు పాలెపు లక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, వారి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ పరామర్శించారు. బుధవారం పల్లం గ్రామంలోని ఎంపీపీ ఇంటికి వెళ్లి ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఆమె భర్త ధర్మరావును,కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు.ఈ కార్యక్రమంలో పల్లం సర్పంచ్ మాల్లాడి వీరబాబ్జి, వైకాపా నాయకులు తదితరులు ఆయన వెంట ఉన్నారు.

## పేదలకు విద్యను దూరం చేయవద్దు- వాకపల్లి

**కాట్రేనికోన, మార్చి 12 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



పాఠశాలలు విలీనం ద్వారా పేదలకు విద్య దూరం అవుతుందని, ఈ ప్రక్రియను తక్షణమే విరమించుకోవాలని డా.బి. ఆర్.అంబెద్కర్ కోనసీమ జిల్లా బహుజన్ సమాజ్ పార్టీ ఉపాధ్యక్షులు, ముమ్మిడివరం నియోజకవర్గం ఇంచార్జ్ వాకపల్లి భీమారావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు. గతంలో జగన్ ప్రభుత్వం కూడా పాఠశాలల విలీనం చేస్తున్నప్పుడు టి.డి.పి., జనసేన పార్టీ లు వ్యతిరేకించి తీరా అధికారం లోకి వచ్చాక గత ప్రభుత్వం విధానాన్నే కొనసాగించడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పేద,బడుగు బలహీనవర్గాల వారి పిల్లలు చదువుకుంటారని అటువంటి పాఠశాలల విలీనం చేయడం వల్ల పేద విద్యార్థులకు చదువుకు దూరం అవుతారని అన్నారు. ఈ ప్రక్రియను ప్రభుత్వం విరమించుకోకపోతే రాబోయే స్థానిక ఎన్నికలలో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

# జాతీయ రహదారుల్లో ప్రమాదాల నివారణకు సబ్ వేస్ లు, ఫ్లై ఓవర్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయండి

**కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ఎంపీ పుట్టా మహేష్ కుమార్ విజ్ఞప్తి.**



ఏలూరు మార్చి 12 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఏలూరు జిల్లా పరిధిలోని జాతీయ రహదారుల్లో ప్రమాదాల నివారణకు సబ్ వేస్ లు, ఫ్లై ఓవర్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ఎంపీ పుట్టా మహేష్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పార్లమెంట్ హౌస్ మంత్రి చాంబర్ రోడ్ లోని కార్యాలయంలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని ఎంపీ మహేష్ కుమార్ కలిసి వినతి పత్రం అందజేశారు.

**కొల్లేటికోటకు డబుల్ లేన్ రోడ్డు నిర్మాణానికి రూ. 109 కోట్లు ఇవ్వండిలి**

గుండుగొలను నుండి పెద్దింట్లమ్మవారి దేవాలయం వరకు దాదాపు 24 కిలోమీటర్ల రహదారి కొల్లేరు సరస్సు ప్రాంతం నుంచి వెళ్తుందని, కొల్లేటిలంక గ్రామాలకు ప్రసిద్ధ పెద్దింట్లమ్మ అమ్మవారి దేవాలయానికి ఏడాది పొడవునా యాత్రికులు సందర్శిస్తారని, పర్యాటక ప్రదేశమైన కొల్లేరుకు ప్రపంచంలోని వివిధ దేశాల నుండి వచ్చే పక్షులను సందర్శించడానికి కొల్లేరు సరస్సు ప్రాంతాన్ని పర్యాటకులు సందర్శిస్తారని ఎంపీ మహేష్ కుమార్ కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే ఉన్న సింగిల్ లేన్ సర్ఫేస్ రోడ్డు అగడలంక ఛానల్‌కు సమాంతరంగా ఉందని, ఈ రహదారిలో ప్రజలు, పర్యాటకులు పడుతున్న ఇబ్బందులు దృష్ట్యా డబుల్ లేన్ రోడ్డు నిర్మాణానికి రూ.109 కోట్లు మంజూరు చేయాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు.

**ఏడు బ్లైండ్ స్పాట్లు వద్ద ఫ్లై ఓవర్లు, సబ్ వేస్ నిర్మించండి:**

అలాగే భీమడోలు వద్ద రెండు కి.మీ ఫ్లైఓవర్ నిర్మించాలని, రోడ్డుకు ఇరువైపులా ఉన్న కూరెళ్లగూడెం వద్ద ప్రజలు ఇంటర్‌చేంజ్ క్రాస్ పాయింట్‌ను దాటి అవతలి వైపునకు రాకపోకలు సాగించే సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయని కేంద్రమంత్రి దృష్టికి ఎంపీ తీసుకెళ్లారు. అంబర్‌పేట, వడ్లపట్ల జెడ్పీ రోడ్డు నుంచి అంబర్‌పేట పొలిమేరపుంత వరకు 1200 మీటర్ల మేర ఫ్లై ఓవర్ నిర్మించాలని, పి.కన్నాపురం నుండి పుల్లకి ఇంటర్‌చేంజ్ పాయింట్ వద్ద 600 మీటర్లు రాంగ్ రూట్ లో ప్రయాణిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారని ఎంపీ మహేష్ కుమార్ కేంద్రమంత్రికి వివరించారు. ప్రమాదాలను నివారించడానికి పి.కన్నాపురం జెడ్పీ రోడ్డు నుంచి కోడూరుపాడు జెడ్పీ రోడ్డు వరకు 1200 మీటర్ల మేర ఫ్లై ఓవర్ లేదా సబ్ వే నిర్మించాలని, జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న కైకరం ఇంటర్ చేంజ్ క్రాసింగ్ పాయింట్ వద్ద రెండు నియోజకవర్గాలను కలిపే జాతీయ రహదారికి ఆర్ అండ్ బీ రోడ్డు కనెక్టింగ్ ఉందని, గ్రామానికి అవతలి వైపునకు రాకపోకలు సాగించే సమయంలో ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారని, ఈ నేపథ్యంలో ఆర్ అండ్ బీ రోడ్డు నుండి కైకరం ముగింపు పాయింట్ వరకు కిలోమీటర్ పొడవు ఫ్లై ఓవర్ లేదా సబ్-వే నిర్మించాలని, మేజర్ పంచాయతీలైన చేబ్రోలు, నారాయణపురం వద్ద నర్సాపురం వైపు ఆర్ అండ్ బీ రోడ్డు దాటుతున్నప్పుడు జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ అవుతుందని, ఈ రహదారిని దాటే సమయంలో జరిగే ప్రమాదాలను తగ్గించేందుకు తాళ్లాపురం పుంత రోడ్డు నుంచి చేబ్రోలు మీదుగా నారాయణపురం గ్రామ శివారు వరకు కిలోమీటర్ పొడవునా ఫ్లై ఓవర్ లేదా సబ్ వే నిర్మించాల్సిన అవసరాన్ని ఎంపీ మహేష్ కుమార్ కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఎన్ హెచ్ -216ఏ, ఎన్.హెచ్-16 జాతీయ రహదారిలో గుర్తించిన ఏడు బ్లైండ్ స్పాట్లు వద్ద ఫ్లైఓవర్‌లు, సబ్ వేస్‌ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రికి ఎంపీ మహేష్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

**ఉంగుటూరు వద్ద ఫ్లైఓవర్ నిర్మించండి:**

రైళ్ల రాకపోకల వల్ల జరిగే ప్రమాదాలను పరిగణనలోకి తీసుకుంటూ ఉంగుటూరు వద్ద ఫ్లైఓవర్ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని ఎంపీ మహేష్ కుమార్ కేంద్ర మంత్రుని కోరారు.

**సీతంపేట వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టండి**

దెందులూరు మండలం సీతంపేట జంక్షన్ వద్ద నాలుగు మీటర్ల ఎత్తు బాక్స్ కల్వర్టు, లేదా పీయుపీ/ సీయుపీ నిర్మాణంతో పాటు గుండుగొలను జంక్షన్ వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జి, బాక్స్ కల్వర్ట్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎంపీ కోరారు. ఎంపీ మహేష్ కుమార్ విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

# భేషరతుగా హామీలు అమలుచేయాలి

**ప్రజాగ్రహానికి గురికాముందే బుద్ధితెచ్చుకోవాలి**
**కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన మార్గాని భరత్**
**యువత పోరు ఆందోళనకు భారీ ర్యాలీగా తరలిన వైసిపి శ్రేణులు**

రాజమహేంద్రవరం మార్చి 12 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ భేషరతుగా కూటమి ప్రభుత్వం అమలు చేయాలని వైఎస్ఆర్ సిపి రాష్ట్ర అధికార ప్రతినిధి మాజీ పార్లమెంట్ సభ్యులు మార్గాని భరత్ రామ్ డిమాండ్ చేసారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు యువత పోరు కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉదయం స్థానిక మార్గాని ఎస్టేట్‌లోని వైసిపి కార్యాలయం నుంచి భరత్ రామ్ ఆధ్వర్యంలో కార్లు, బైక్‌లతో భారీ ర్యాలీగా బొమ్మూరులోని కలక్టరేట్‌కి చేరారు. కలెక్టర్‌కి వినతిపత్రం అందజేసిన అనంతరం భరత్ మాట్లాడుతూ ఫీజు రీ ఇంబర్స్‌మెంట్ బిల్లులు విడుదల చేయకపోవడం దారుణమన్నారు. అమ్మఒడి పథకాన్ని తల్లికి వందనంగా మార్చేశారని, ఎంతమంది పిల్లలున్నా రూ.15వేలు చొప్పున ఇస్తామని ఎన్నికల ముందు నమ్మబలికారని భరత్ పేర్కొన్నారు. తల్లికి వందనం ఇంతవరకు అమలు చేయలేదు సరికదా చాలామందిని ఈ పథకం నుంచి తొలగించే ప్రయత్నం కూడా చేస్తున్నట్లు తెలుస్తోందని భరత్ ఆరోపించారు. బడ్జెట్‌లో సూపర్ సిక్స్‌కి సంబంధించి ఏ ఏ పథకానికి ఎన్ని నిధులు కేటాయించారని ఆయన నిలదీశారు. మెగా డీఎస్సీ అన్నారని, తొలిసంతకం కూడా చేసారని, తీరా చూస్తే 16వేల పోస్టులు ఏ రకంగా తీస్తారో అర్థం కావడం లేదని అన్నారు. అలాంటప్పుడు సంతకానికి ఇక విలువ ఏముందని భరత్ ప్రశ్నించారు. ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా వైస్సార్ సిపి శ్రేణులు కదం తొక్కి పెద్దఎత్తున యువత పోరు కార్యక్రమంలో పాల్గొన్నారని ఆయన తెలిపారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం బుద్ధి తెచ్చుకుని ఇచ్చిన హామీలు అమలు చేయాలనీ ఆయన డిమాండ్ చేసారు.





# అసంపూర్తి ఇళ్లకు అదనపు ఆర్థిక సహాయం

## జిల్లాలో 27,441 మందికి ప్రయోజనం: కలెక్టర్

రాజమహేంద్రవరం మార్చి 12 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

తూర్పు గోదావరి జిల్లాలో పిఎంఏవై 1.0 అర్బన్, గ్రామీణ్ 1.0 పథకముల ద్వారా 429 లే అవుట్లలో, స్వంత స్థలాలలో ఇళ్ళు మంజూరు కాబడి వివిధ దశలలో ఉన్న 11,345 మంది ఎస్సీలు, 549 మంది ఎస్టీలు, 15,547 మంది బీసీలు వెరసి 27,441 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం అదనపు ఆర్థిక సాయం క్రింద రూ.138.57 కోట్ల నిధులు మంజూరు చేసియున్నారని కలెక్టర్ పి ప్రశాంతి బుధవారం ఒక ప్రకటనలో తెలియచేసారు. జిల్లాలోని నియోజక వర్గం వారీగా అనపర్తి 3926, రాజానగరం 2530, రాజమండ్రి రూరల్ 2082, రాజమండ్రి అర్బన్ 4987, కొవ్వూరు 4611, నిడదవోలు 3825, గోపాలపురం 5480, మొత్తంగా 27,441 మందికి లబ్ధిదారులకు ప్రయోజనం చేకూర్చనున్నట్లు ఆమె తెలిపారు. ఎస్సి, బిసిలకు రూ.50,000, ఎస్టిలకు రూ.75,000 మేర ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వారు ఇచ్చిన సదవకాశం వినియోగించుకొని వివిధ దశలలో ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోయిన లబ్ధిదారులందరు మే 2025 నెలాఖరులోగా ఇళ్ళ నిర్మాణం పూర్తి చేసుకొనుటకు ముందుకు రావలెనని కోరారు. స్వర్ణాంధ్ర -2047 విజన్ సాకారంలో భాగంగా 2029 నాటికి 'అందరికీ ఇల్లు' ఏర్పరచాలనే దృఢనిశ్చయంతో ప్రభుత్వం వారు చర్యలు తీసుకోవడం జరుగుతున్నట్లు కలక్టర్ ప్రశాంతి తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తముగా ఉన్న హౌసింగ్ అధికారులు, మండల అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమీషనర్లు, ఇతర అధికారులు అందరు స్థానిక ప్రజా ప్రతినిధులు, శాసన సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు ద్వారా గృహ లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని కోరారు. జూన్ 4వ తేదీకి నూతన ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తి అయిన సంధర్భముగా రాష్ట్ర వ్యాప్తముగా 5 లక్షల గృహ ప్రవేశాలు ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, అందులో భాగంగా మన జిల్లాకు 10,794 ఇళ్ళు పూర్తి చేయుటకు టార్గెట్ ఇవ్వడం జరిగినదన్నారు. నిర్దేశించిన లక్ష్యాలలో ఇప్పటి వరకు 4,796 ఇళ్ళు పూర్తి చేయడం జరిగినదన్నారు. మిగిలిన 5,998 ఇళ్ళు పూర్తి చేయుటకు ప్రభుత్వం వారు అదనంగా అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని వినియోగించుకొని మిగిలిన ఇళ్ళు మే నెలాఖరుకి పూర్తి చేయవలసి ఉన్నదన్నారు. లబ్ధిదారులందరు కూడా ప్రభుత్వం అందిస్తున్న ఈ అదనపు ఆర్థిక సహాయాన్ని వినియోగించుకొని 'సొంతింటి కల' సాకారం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.



## సిఎమ్ఆర్ జ్యువలరి షాపును ప్రారంభించిన సినీ నటి మీనాక్షి చౌదరి



అమలాపురం, మార్చి 12 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

సిఎమ్ఆర్ జ్యువలరి షోరూమ్ లో నేటి మహిళలు మెచ్చే, నచ్చే విధంగా ఆధునిక మోడల్ గోల్డ్ ఆభరణాలు అందుబాటులో ఉన్నాయని వర్ధమాన సినీ నటి కుమారి మీనాక్షి చౌదరి అన్నారు. ఏలూరు పరిసర ప్రాంతాల ప్రజలకు సిఎమ్ఆర్ జ్యువలరీ షాప్ అదునాతన ఆభరణాల ఘని అన్నారు. ఈ షాపు ఏలూరులో బుధవారం తన చేతుల మీదగా పునః ప్రారంభం చేయడం తన అదృష్టమన్నారు. ఈకార్య క్రమంలో ప్రముఖ పారి శ్రామిక వేత్త అంబికా కృష్ణ, చందన మోహన్ రావు, మావూరి వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

## రూ.100 కోట్లతో నగరంలో అభివృద్ధి పనులు

**త్వరలో రివర్ ఫ్రంట్ పనులు ప్రారంభం**
**పార్కుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు : ఎమ్మెల్యే శ్రీనివాస్**



రాజమహేంద్రవరం మార్చి 12 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ తొమ్మిది నెలల్లో రాజమండ్రి సిటీ నియోజకవర్గంలో రూ.100 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ చెప్పారు. స్థానిక 9వ డివిజన్లో రూ.20 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణం పనులను మాజీ కార్పొరేటర్ కోసూరి చండిప్రియతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర అభివృద్ధికి నిధులు కేటాయించాలని అసెంబ్లీలో కూడా అడుగుతున్నానని గుర్తు చేశారు. త్వరలో రివర్ ఫ్రంట్ పనులు ప్రారంభం అవుతాయన్నారు. దీనికి సంబంధించి టెండర్, కాంట్రాక్టరు ఫైనల్ అయ్యారని, అసెంబ్లీ సమావేశాల తర్వాత పనులు మొదలవుతాయని తెలిపారు. నగరంలోని అన్ని పార్కులను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి ఎక్కడికక్కడ ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొనేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఏదో ఒక పార్కు సుందరీకరణపై దృష్టి కేంద్రీకరించడం కాకుండా అన్ని చోట్లా ఉన్న పార్కులను సుందరీకరణ చేస్తున్నామని తెలిపారు. దీనిపై అధికారులు నిర్ణయం తీసుకోవడంకన్నా పార్కు అభివృద్ధి కమిటీ సభ్యులు, వాకర్స్ సలహాలు సూచనలు మేరకు ఏర్పాట్లు చేస్తామని స్పష్టం చేశారు. గతంలో టిడిపి హయాంలో మంజూరైన నిధులతో బీసీ బాలుర వసతి గృహం నిర్మించామని, తర్వాత వైసీపీ పాలనలో బీసీ బాలికల వసతి గృహాన్ని నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. ఇప్పుడు బాలికల వసతి గృహం పనులకు నిధులు అడిగామని త్వరలో పనులు చేపడతామని చెప్పారు. రానున్న గోదావరి పుష్కరాలకు కూడా నిధులు కోరుతున్నామని చెప్పారు. నగరాభివృద్ధికి నిధుల కోసం ఆయా ప్రభుత్వ శాఖలను అడుగుతున్నామని, అసెంబ్లీ సమావేశాల్లో వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రభుత్వాన్ని అడుగుతున్నామన్నారు. ముఖ్యమంత్రి సహకారంతో రాజమండ్రి నగర అవసరాలన్ని తీరుతాయని ఎమ్మెల్యే శ్రీనివాస్ ఆశా భావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మరుకుర్తి శివ యాదవ్, యిన్నమూరి దీపు, కుచర్లపాటి విశ్వనాథ రాజు, కొల్లి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు, మార్చి 12 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఈనెల 13వ తేది గురువారం ఏలూరు 1వ పట్టణం లో గల కోటదిబ్బ సబ్ స్టేషన్ పరిధి లో జనార్దనస్వామి రథోత్సవం ఊరేగింపు సందర్భముగా సాయంత్రం 04:00 గంటల నుండి రాత్రి 10:00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపదల చేయబడునని, ఈ సమయములో కోటదిబ్బ సబ్ స్టేషన్ పరిధి లో గల మెయిన్ బజార్, అగ్రహారం, న్యూ మార్కెట్, గజ్జలవారి చెరువు ఏరియా, గడియార స్థంభం ఏరియా, కుండి సెంటర్, మరియు పెరుగుచెట్టు ఏరియా పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఆపరేషన్ కె.ఎం. అంబేద్కర్ తెలిపారు. కావున వినియోగదారులు సహకరించవలసినదిగా కోరారు.

## శక్తి యాప్ పోస్టర్ ఆవిష్కరించిన సినీ నటి మీనాక్షి చౌదరి

ఏలూరు, మార్చి 12 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)




ఏలూరు జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ ఐపీఎస్ యొక్క ఆదేశాలపై ఏలూరు డిఎస్పి డి. శ్రావణ్ కుమార్ యొక్క ఆధ్వర్యంలో మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎం సుబ్బారావు , ఏలూరు 3 టౌన్ ఇన్స్పెక్టర్ కోటేశ్వరరావు మహిళా పోలీస్ సిబ్బంది ప్రముఖ సినీ తార మీనాక్షి చౌదరి తో ఏలూరు మహిళా పోలీస్ సిబ్బంది ప్రముఖ వ్యాపార సంస్థ సీ.ఎం.ఆర్ వద్ద శక్తి యాప్ ను గురించి మహిళలు గాని బాలికల వద్ద గాని ఈ యొక్క యాప్ ఉంటే కలిగే ఉపయోగాలను గురించి పోలీసు అధికారులు పుర ప్రముఖులు యాప్ ద్వారా ఉన్న అవకాశాలను గురించి తెలియ చేసారు. ఈ కార్యక్రమంలో ఏలూరు డిఎస్పి డి.శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం మహిళలు, బాలికలు, మరియు ఇతర స్త్రీల భద్రత కొరకు శక్తి యాప్ (శక్తి యాప్ ) ను ప్రవేశపెట్టింది. ఈ యాప్ ప్రధానంగా మహిళలపై జరిగే వేధింపులు, అత్యాచారాలు, మరియు ఇతర హింసాత్మక సంఘటనలను నివారించడానికి ఉపయోగపడుతుంది అని తెలియచేసారు.

**శక్తి యాప్ యొక్క ముఖ్య ప్రయోజనాలు**

1.అత్యవసర సహాయం %-% మహిళలు ఏదైనా ప్రమాదకర పరిస్థితిలో ఉన్నప్పుడు, ఈ యాప్ ద్వారా పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వవచ్చు. ఒక క్లిక్ ఎస్ ఓ ఎస్ అలర్ట్ ఒక్క కీ నొక్కితే పోలీసులకు, కుటుంబసభ్యులకు, లేదా స్నేహితులకు అప్రమత్తమైన సందేశం వెళ్ళిపోతుంది అని తెలియచేసారు. జియో-లోకేషన్ ట్రాకింగ్ అత్యవసర పరిస్థితుల్లో, పోలీస్ కంట్రోల్ రూమ్ మహిళ ఉన్న ప్రదేశాన్ని తక్షణమే గుర్తించి సహాయం అందించగలదు నేరం నివేదిక కంప్లైంట్స్ రిజిస్ట్రేషన్ వేధింపు, లైంగిక దాడి, ఎవరైనా శారీరకంగా హాని కలిగించినప్పుడు, మహిళలు ఈ యాప్ ద్వారా నేరాన్ని అధికారులకు తెలియజేయవచ్చు అని తెలిపారు. సమాచార అవగాహన మహిళా హక్కులు, రక్షణ చట్టాలు, మరియు ప్రభుత్వ నిబంధనల గురించి పూర్తి వివరాలు పొందవచ్చు.ప్రత్యక్ష పోలీస్ సహాయం సమీపంలోని పోలీస్ స్టేషన్ సమాచారం, హెల్ప్‌లైన్ నంబర్లను యాప్‌లో పొందుపరిచారు. మహిళలు మరియు బాలికలు విద్యార్థినులు, ఉద్యోగినులు, గృహిణులు అత్యవసర పరిస్థితుల్లో రక్షణ అవసరమైన వారు ఉపయోగించాలని తెలిపారు. ఈ యాప్ ఎలా ఉపయోగించా గూగుల్ ప్లే స్టోర్ గూగుల్ ప్లే స్టోర్ ద్వారా శక్తి అప్ ను డౌన్‌లోడ్ చేసుకోవాలి అని తెలియచేసారు. మీ వ్యక్తిగత వివరాలను నమోదు చేసుకోవాలి అని తెలియ చేశారు. అత్యవసర పరిచయాలను ఎమర్జెన్సీ కాంటాక్ట్స్ బిఫోర్ హ్యాండ్ జోడించాలి అని తెలియజేశారు. ఏదైనా ప్రమాదం జరిగితే, యాప్ ఓపెన్ చేసి ఎస్ ఓ ఎస్ బటన్ ను నొక్కితే, మీ యొక్క స్థానాన్ని (లొకేషన్ ) గుర్తించి పోలీసులు తక్షణమే స్పందిస్తారు అని తెలియజేశారు. ఈ యాప్ ద్వారా మహిళలు, బాలికలు మరింత భద్రంగా ఉండగలరు మరియు అత్యవసర సమయంలో పోలీస్ యొక్క సహాయాన్ని పొందగలరు అని తెలియ చేసారు.

తెలుగురాష్ట్రం దినపత్రిక

# తన పాలనా వైఫల్యాలపై తానే పోరాడుకుంటున్న జగన్

## తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి దండంగి మమత

**ఆలమూరు, మార్చి 12 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

జగన్ పాపాలు నేడు విద్యార్థుల పాలిట శాపాలుగా మారాయని తెలుగుదేశం రాష్ట్ర మహిళా అధికార ప్రతినిధి దండంగి మమత వ్యాఖ్యానించారు. ఆలమూరు మండలం చింతలూరు ఆమె స్వగృహంలో బుధవారం మీడియాతో మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం చేసిన తప్పుల్ని కూటమి ప్రభుత్వం పై నెట్టాలని చూస్తున్న జగన్, వైసీపీ నాయకుల తీరు హాస్యాస్పదంగా ఉందన్నారు. జగన్ అధికారం కోల్పోయేనాటికి రాష్ట్రంలో విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.2,100 కోట్లు, వసతి దీవెన మరో 1,400 కోట్లు మొత్తంగా రూ.3,500 కోట్లు బకాయిపెట్టి పోయారని తెలిపారు. ఇక పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులకు చెల్లించాల్సిన బకాయిలను ఐదేళ్లూ జగన్ ప్రభుత్వం ఇవ్వలేదు. ప్రైవేటు కళాశాలల్లో పీజీ అభ్యసిస్తున్న వారి ఫీజుల చెల్లింపు పథకాన్ని 2020-21 నుంచే నిలిపివేసిందని, అంతకుముందు, అప్పటి వరకు ప్రవేశాలు పొందిన వారికి చెల్లించాల్సిన బకాయిలు రూ.500 కోట్లకుపైగా ఉన్నాయని, వాటిని కూడా జగన్ సర్కారు చెల్లించలేదని విమర్శించారు. ఫీజు రీయింబర్స్మెంట్ పథకం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఆ పథకాన్ని అన్ని ప్రభుత్వాలు సక్రమంగా కంటిన్యూ చేశాయన్నారు. 2014 -19 మధ్య తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ఈ పథకం ఎంతో ప్రయోజనకరంగా ఉండేదన్నారు. అయితే జగన్ 2019లో అధికారంలోకి వచ్చాక తన పేరు కోసం ఈ పథకాన్ని సర్వనాశనం చేసి తల్లుల ఖాతాల్లో నగదు జమయ్యేలా చేస్తానని పథకం



రూపు రేఖలు మార్చి నిర్వీర్యం చేశారని తెలిపారు. సక్రమంగా ఫీజులు చెల్లించకుండా విద్యార్థులను, కళాశాల యజమానులను, తల్లితండ్రులను నానాహింసలు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. మరలా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జగన్ పెట్టిన బకాయిల్లో 700 కోట్లు విడుదల చేయడమే కాకుండా ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని తిరిగి విద్యార్థులకు, తల్లిదండ్రులకు, కళాశాల యాజమాన్యాలకు మేలు చేసేలా నేరుగా ప్రభుత్వం, కళాశాల యాజమాన్యాల మధ్య లావాదేవీలు ఉండేలా సరిచేసిన ఘనత మానవవనరుల శాఖ మంత్రి లోకేష్ కు దక్కుతుందని ఆమె అన్నారు. ఇప్పుడు జగన్ పిలుపు ఇచ్చిన ఫీజు పోరు తన హయాంలో తాను పెట్టిన బకాయిల పైనే అని ఆమె అన్నారు. జగన్ పిలుపునివ్వడం వైకాపా నేతలు ఫీజు పోరంటూ గంతులు వేయడం చూస్తుంటే జగన్ పాలన అధ్వానంగా సాగిందని, ఆ పార్టీ నాయకులే ఆ పార్టీ ఆవిర్భావ దినోత్సవం రోజు ప్రజలకు చెప్పడానికి బయలుదేరినట్లు అయ్యిందని ఎద్దేవా చేశారు. జగన్ పాలనలో ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తం అవ్వడంతో ఒక్కొక్క వ్యవస్థను చక్కబెట్టుకుని రావడం కూటమి ప్రభుత్వం వంతు అయ్యిందన్నారు. జగన్ పెట్టిన బకాయిలను సైతం కూటమి ప్రభుత్వం దప దపాలుగా చెల్లిస్తామని చెబుతుందని, 2019 మార్చి లో రైతు రుణమాఫీ చివరి విడత నిధులపై అప్పటి ప్రభుత్వం జీవో విడుదల చేసినా ఎన్నికల కోడ్ అమల్లోకి రావడం వల్ల తాత్కాలికంగా ఆగితే తరువాత అధికారంలోకి వచ్చాక జగన్ మోసం చేసి ఆ నిధులు విడుదల చేయకుండా ఆపి, గత ప్రభుత్వ బకాయిలు ఇప్పుడు ఎందుకు చెల్లిస్తామని ఇష్టం వచ్చినట్లు మాట్లాడారని, అలా తమ ప్రభుత్వం చేయడం లేదని మమత తెలిపారు.


## ప్రార్థించే పెదవులు కన్న.. సాయం చేసే చేతులు మిన్న
## చినఅమిరం అనాథాశ్రమంలోని బాలలకు అన్నదానం చేసిన ఈది ఫౌండేషన్



**భీమవరం, మార్చి 12 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ప్రార్థించే పెదవులు కన్న .. సాయం చేసే చేతులు మిన్న అనే నినాదంతో ఈది ఫౌండేషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని రాష్ట్ర అంబేద్కర్ ఆశయ సాధన కమిటీ ఫౌండర్ అండ్ ప్రెసిడెంట్ కోనా జోసెఫ్ అన్నారు. చినఅమిరం ఇమ్మాన్యుయేలు అనాథ ఆశ్రమంలో చిన్నారుల మధ్య ఈది ఫౌండేషన్ సేవా సంస్థను ప్రారంభించి బాలలకు అన్నదానం చేశారు. జోసెఫ్ మాట్లాడుతూ సమాజసేవలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు. ఈది ఫౌండేషన్ ఫౌండర్ ఈది రవికుమార్ మాట్లాడుతూ మా ఫౌండేషన్ ద్వారా నిత్యం సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని, రానున్న వేసవిలో ప్రధాన కూడలిలో చలివేంద్రాలను ఏర్పాటు చేస్తామని అన్నారు. అనంతరం 50 మంది బాలలకు అన్నదానం చేసి కేక్ లను పంపిణి చేశారు. కార్యక్రమంలో ఫ్రాన్సెస్, కేసి రాజు, బి కమలకర్, గాతల సందీప్, తాడి రాజశేఖర్, ఆధార్ రాజు పాల్గొన్నారు.

## ప్రభుత్వ చేసిన ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు వివరించాలి
## .. కోళ్ల నాగేశ్వరరావు



**భీమవరం, మార్చి 12 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

కూటమి ప్రభుత్వం ఏర్పడి 9 నెలలు కాలంలో జరిగిన ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు కూటమి నాయకులు, టీడీపీ శ్రేణులు ప్రజలుకి వివరించాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి, ఎఎంసి మాజీ చైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు అన్నారు. బుధవారం నాగేశ్వరరావు క్యాంప్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. అన్న క్యాంటీన్ల ప్రారంభం, రహదారులు బాగు చేసి ప్రజా రవాణా మెరుగు పర్చడం, ఉచ్చిత ఇసుక పాలసీ, నిరుద్యోగులకు డిఎస్సీ ప్రకటన, రైతులకి ధాన్యం బకాయలు తీర్చడం, రూ 4 వేలు పెన్షన్ అమలు, మహిళలకు ఉచ్చిత గ్యాస్ సిలిండర్ల పథకం ప్రవేశ పెట్టమని అన్నారు. జగన్ ప్రభుత్వంలో దాగ పడ్డ ప్రజలు రాష్టంలో కూటమి నాయకత్వంలో ప్రజా పరిపాలన సంక్షేమం జరుగుతున్నాయని వీటిని ప్రజలకు కూటమి నాయకులు తెలియజేయాలని కోరారు.

# జిల్లా మలేరియా అధికారిగా వెంకటేశ్వరరావు



**భీమవరం, మార్చి 12 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా మలేరియా అధికారిగా నక్కా వెంకటేశ్వరరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎం.దుర్గారావు దొరకు జాయినింగ్ నివేదికను సమర్పించి బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన జిల్లా కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ ఆర్.మహేష్ కుమార్ ను జిల్లా కలెక్టరేట్ లో మర్యాద పూర్వకంగా కలిసారు. ఆయన ఉమ్మడి తూర్పు గోదావరి ఏజెన్సీ జిల్లా మలేరియా కార్యాలయంలోను, తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో పనిచేసారు. పదోన్నతిపై సీనియర్ ఎంటోమొలజిస్ట్ గా కాకినాడ ఎఫ్.ఆర్.టి.సి నుంచి ఆంధ్రప్రదేశ్ కమీషనర్ అఫ్ హెల్త్ ఫ్యామిలీ వెల్ఫేర్, విజయవాడ వారి ఉత్తర్వులు మేరకు ఇన్చార్జి జిల్లా మలేరియా అధికారిగా నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని సబ్ యూనిట్ అధికారులు పాల్గొన్నారు.

# భారీ స్థాయిలో జనసేన సభ

## రాష్ట్రం దివాళాకు జగన్ వైఖరే కారణం - మంత్రులు నాదెండ్ల, దుర్గేష్



**కాకినాడ, మార్చి 12 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):**

ఈనెల 14వ తేదీన పిఠాపురం నియోజకవర్గం లోని చిత్రాడ గ్రామంలో నిర్వహించనున్న జనసేన పార్టీ 12వ ఆవిర్భావ సభకు భారీ ఎత్తున ఏర్పాట్లను చేస్తున్నామని ఈ సభకు లక్షలాది మంది జనసైనికులు హాజరవుతారని మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్ వెల్లడించారు. ఈ సభకు సంబంధించి అన్ని ఏర్పాట్లను ఆయా కమిటీలు పకడ్బందీగా చేస్తున్నాయని ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వారు చెప్పారు. మంగళవారం జనసేన పార్టీ ఆధ్వర్యంలో స్థానికంగా విలేకరులతో సమావేశాన్ని నిర్వహించి ఆవిర్భావ సభ ఏర్పాట్లను వివరించారు. ఈ సందర్భంగా మంత్రులు నాదెండ్ల, కందులలు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వంలో ఉండి ఈ సభను నిర్వహిస్తున్నామని దీనికి అధిక సంఖ్యలో హాజరవ్వడానికి తగు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సభ ప్రాంగణంతో పాటు పలు చోట్ల వైద్య శిబిరాలు, తాగునీరు, భోజన సదుపాయం, ఎల్ఈడి స్క్రీన్స్, మరుగు వంటివి ఏర్పాటు చేస్తున్నామన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న జనసేన అధినేత పవన్ అభిమానులు, జనసైనికులు ఈ సభకు లక్షల్లో హాజరవుతారని మనోహర్, దుర్గేష్లు చెప్పారు. ఈ సభ ద్వారా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మంచి సందేశాన్ని ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈనెల 12న వైసీపీ ఆధ్వర్యంలో చేపట్టే యువత పోరుపై వారు స్పందించారు. యువతతో పాటు రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన జగన్ ఇప్పుడు ఫీజు ఫోరు అంటూ కొత్త నాటకానికి తెరలేపారన్నారు. రాష్ట్రం నాశనం అవ్వడానికి జగన్ వైఖరి కారణమని వారు చెప్పారు. వ్యవస్థలను సర్వనాశనం చేసిన జగన్ ప్రభుత్వానికి యువత, మహిళలు, రాష్ట్ర ప్రజలు బుద్ధి చెప్పారని కందుల, నాదెండ్లలు అన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ పి హరిప్రసాద్, ఎమ్మెల్యేలు పంతం నానాజీ, పత్సమట్ల ధర్మరాజు స్థానిక నాయకులు తలాటం సత్య, చోడిశెట్టి శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# క్విట్ ఇండియా స్థూపం వద్ద దండి సత్యాగ్రహ దినోత్సవ వేడుకలు


**భీమవరం, మార్చి 12 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):**



ఉప్పు సత్యాగ్రహం..మహోజ్వల ఘట్టమని, ఉప్పు సత్యాగ్రహంలో పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన భూమిక పోషించిందని భీమవరం ఎస్టివో అల్లూరి రవివర్మ అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక అధ్వర్యంలో క్విట్ ఇండియా స్థూపం వద్ద దండి సత్యాగ్రహ దినోత్సవాన్ని నిర్వహించారు. ఎస్టివో రవివర్మ మాట్లాడుతూ ఉప్పు పన్నును ధిక్కరిస్తూ గాంధీజి 1930 మార్చి 12 నుండి 1930 ఏప్రిల్ 6 వరకు 384 కిలోమీటర్ల దూరం వేలమంది సత్యాగ్రహులతో కలిసి పాదయాత్ర చేసారని, 24 రోజుల తరువాత దండి వద్ద ముగిసిందన్నారు. ఎస్టివో ఆఫీస్ సీనియర్ అకౌంటెంట్ పీఎస్ఎస్ ప్రసాద్ బాబు, న్యాయవాదులు ఉండపల్లి రమేష్ నాయుడు, సూరిశెట్టి కల్పన, పాలా లక్ష్మి, నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ గాంధీజి తన 79 మంది సత్యాగ్రహ వాలంటీర్లతో సబర్మతి ఆశ్రమంలో ఈ యాత్రను ప్రారంభించారని, గాంధీజీ నాయకత్వంలో జరిగిన ఈ ఉద్యమం జిల్లాలో మహోద్యమంగా ఉధృతంగా సాగిందన్నారు. కార్యక్రమంలో కళాకారులు ఎస్ కె చాన్ భాషా, పెన్షనర్స్ అసోసియేషన్ ట్రెజరర్ సూర్యనారాయణ, పెండ్యాల సరిత, కె పార్వతి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మేటర్నిటీ లీవ్ ప్రకటన హర్షించ దగ్గ విషయం..రవికుమార్

**కడియం, మార్చి 12 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):**



ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మేటర్నిటీ లీవ్ కు సంబంధించిన ప్రకటన హర్షించదగ్గ విషయం, ప్రభుత్వ మహిళా ఉద్యోగులకు ఎన్ని కాన్పులుకైనను ఈ లీవును వర్తింప చేయడం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఇదే మాదిరిగా రాష్ట్ర ప్రభుత్వం లో రెగ్యులర్ ఉద్యోగులకు వర్తింపజేసే విధంగా కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ మహిళా ఉద్యోగులకు కూడా వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సహృదయంతో త్వరలో మహిళా ఉద్యోగు లందరికీ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ మహిళా ఉద్యోగులకు కూడా వర్తింప చేస్తారని ఇప్పటికీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల రాష్ట్ర చరిత్రలో ఈ నిర్ణయం చిరస్థాయిగా ఒక మంచి నిర్ణ యంగా నిలబడుతుంది. ఇక రానున్న రోజుల్లో కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు కూడా వర్తింప చేస్తే చరిత్రలో మరువ రాని అంశంగా మారుతుంది అని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యో గుల సంఘం, జిల్లా ఉపాధ్యక్షుడు, పి రవికుమార్ అన్నారు.

తెలుగురాష్ట్రం దినపత్రిక
SPORTS NEWS
https://epaper.teluguraastram.com
అమలాపురం
మార్చి 13, గురువారం 2025

# రోహిత్ కెప్టెన్సీలో ప్రత్యేకత అదే: సెహ్వాగ్



**వరుసగా రెండు ఐసీసీ ట్రోఫీలను టీమ్ఇండియా గెలుచుకుంది. రోహిత్ శర్మ నాయకత్వంలో ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీని నెగ్గిన భారత్.. అంతకుముందు టీ20 ప్రపంచకప్‌ను సొంతం చేసుకుంది. ఇక గత వన్డే ప్రపంచకప్ ఫైనల్‌కూ దూసుకెళ్లింది. 37 ఏళ్ల రోహిత్ భవిష్యత్తులో కొనసాగడంపై ఇప్పటికీ సందిగ్ధత నెలకొంది. రిటైర్‌మెంట్ తీసుకోవడం లేదని ప్రకటించినా.. 2027లో జరగనున్న వన్డే ప్రపంచకప్ వరకూ కొనసాగడం కష్టమేనన్న వాదనా ఉంది. అయితే, అతడి కెప్టెన్సీ తీరుపై సర్వత్రా ప్రశంసల వర్షం కురుస్తోంది. భారత మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ కూడా రోహిత్‌ను అభినందించాడు. సారథిగా వ్యవహరించిన తీరు అద్భుతమని కొనియాడాడు.**

"చాలామంది రోహిత్ కెప్టెన్సీని తక్కువగా అంచనా వేశారు. కానీ, అతడు వరుసగా రెండు ట్రోఫీలను భారత్‌కు అందించాడు. ఎంఎస్ ధోనీ తర్వాత నిలిచాడు. తన బౌలర్లను వినియోగించుకొనే తీరు, జట్టును హ్యాండిల్ చేసే విధానం బాగుంది. రిజర్వ్ బెంచ్‌కే పరిమితమైన వారితో మాట్లాడే విధానం అద్భుతం.

తొలి మ్యాచ్‌లో అర్ష్‌దీప్ సింగ్‌ను కాదని హర్షిత్ రాణాకు అవకాశం ఇచ్చాడు. ఆ తర్వాత వరుణ్ చక్రవర్తికి ప్లేస్ ఇచ్చాడు. ఆ సమయంలో తుది జట్టులో అవకాశం రానివారిని సముదాయించాడు. అదే, అతడిని అత్యుత్తమ కెప్టెన్‌గా నిలిపింది. వ్యక్తిగతంగా అతడి గురించి తక్కువగా ఆలోచిస్తాడు. జట్టు కోసం, సహచరుల కోసం ఎక్కువగా ఆలోచించే సారథి. వారిని కమ్‌ఫర్ట్‌గా ఉంచేందుకు ప్రయత్నిస్తాడు. ఎవరైనా అభద్రతాభావంతో ఉంటే సరైన ప్రదర్శన చేయలేరని రోహిత్‌కు తెలుసు. అందుకే, జట్టులో ఏ ప్లేయర్‌లోనూ అభద్రతాభావం ఉండకుండా చేసేందుకు చర్యలు తీసుకుంటాడు.

# బీసీసీఐ ఇచ్చేది బ్యాంకుల్లో పెట్టుకొనేందుకా?

## రాష్ట్ర సంఘాలపై గావస్కర్ ఫైర్

**దేశవాళీ క్రికెట్ వృద్ధి కోసం భారత క్రికెట్ బోర్డు పెద్దఎత్తున నిధులు అందజేస్తోంది. రాష్ట్ర క్రికెట్ సంఘాలకు సబ్సిడీలను ఇస్తోంది. ఫస్ట్ క్లాస్, లిస్ట్ %ూ% క్రికెట్‌కు ప్రాధాన్యం ఇవ్వాలనేది బీసీసీఐ ఆలోచన. సెంట్రల్ కాంట్రాక్ట్ క్రికెటర్లు అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడని సమయంలో దేశవాళీలో ఆడాలని ఇప్పటికే బీసీసీఐ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిన సంగతి తెలిసిందే. అందులోభాగంగా పలువురు గత రంజీ ట్రోఫీ మ్యాచ్‌ల్లో ఆడారు. క్రికెట్ అభివృద్ధి కోసం కేటాయించిన నిధులను కొన్ని రాష్ట్ర సంఘాలు సద్వినియోగం చేసుకోకుండా.. సొమ్మును బ్యాంకుల్లో ఉంచుకొనేందుకు మొగ్గు చూపడం భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్‌కు ఆగ్రహం తెప్పించింది. ఆటగాళ్లకు భత్యాలు చెల్లించడంతో పాటు మైదానాల్లో మౌలిక సదుపాయాలను కల్పించాల్సిన అవసరం ఉందని సూచించారు.**

రోహిత్ కెప్టెన్సీలో ప్రత్యేకత అదే: సెహ్వాగ్



"బీసీసీఐ నుంచి ప్రతి రాష్ట్ర క్రికెట్ బోర్డుకు భారీగానే నిధులు వస్తున్నాయి. వీటిల్లో ఎక్కువ భాగం రాయితీల రూపంలోనే అందుతున్నాయి. కొన్ని సంఘాలు మాత్రం వాటిని వినియోగించకుండా బ్యాంకుల్లో భద్రంగా ఉంచుకుంటున్నాయి. ఆట మెరుగుదల కోసం ఇచ్చిన వాటిని ఎందుకు వాడుకోవడం లేదు. కాబట్టి.. రంజీ మ్యాచ్‌ల్లో ఆడే టీమ్‌లకు బీసీసీఐ ఇచ్చే ఫీజులను ఇకనుంచి స్టేట్ బోర్డులే భరించగలవని అనుకుంటున్నా" అని గావస్కర్ వ్యాఖ్యానించాడు.

**ముంబయి క్రికెట్ అసోసియేషన్‌లా చేయండి**

"రంజీల్లో ఆడే ప్లేయర్లకు వచ్చే సీజన్ నుంచి మ్యాచ్ ఫీజును పెంచి ఇవ్వాలని బీసీసీఐ నిర్ణయం తీసుకోవడం అభినందనీయం. అయితే, ఐపీఎల్‌కు ఎంపికైన అన్‌క్యాప్డ్ ప్లేయర్ ఆర్జించే దానికి.. దేశవాళీలో టాప్ ప్లేయర్ దక్కించుకొనే మ్యాచ్ ఫీజుల మధ్య వ్యత్యాసం చాలా ఎక్కువగా ఉంటుంది. ఆ లోటును పూరించాలంటే ముంబయి క్రికెట్ అసోసియేషన్‌ను ఇతర రాష్ట్రాల క్రికెట్ సంఘాలు ఫాలో కావాలి. బీసీసీఐ ఇచ్చే భత్యానికి సమానంగా ఆటగాళ్లకు రాష్ట్ర బోర్డులూ ఫీజును ఇవ్వగలిగితే.. డొమిస్టిక్‌లో ఆడే రోజులను బట్టి ప్లేయర్లకు మంచి మొత్తమే దక్కుతుంది. అలా చేయాలంటే బీసీసీఐ ఇచ్చే రాయితీ సొమ్మును సద్వినియోగం చేసుకోవాలి" అని సునీల్ గావస్కర్ వెల్లడించారు.

# ఆ ట్రెండ్‌కు తెరదించిన గౌతమ్ గంభీర్!

**భారత జట్టుకు ప్రధాన కోచ్‌గా వచ్చిన తర్వాత ఎవరూ ఆ బాధ్యతలను నిర్వర్తించలేదు. కానీ, ఇప్పుడు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ మాత్రం పాత పద్ధతులకు స్వస్తి చెబుతూ తనదైన శైలిలో దూసుకుపోతున్నాడు. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీని టీమ్ఇండియా గెలుచుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు ఐపీఎల్ కోసం భారత క్రికెటర్లు సిద్ధమవుతున్నారు. ప్రధాన కోచ్‌గా గంభీర్‌కు దాదాపు రెండున్నర నెలలపాటు జట్టుతో ఉండాల్సిన అవసరం లేదు. కానీ, తదుపరి సిరీస్‌ల కోసం వ్యూహాలను సిద్ధం చేసుకొనేందుకు వెళ్తున్నారు. తాజా కథనాల ప్రకారం.. గౌతమ్ గంభీర్ భారత్ A జట్టుతో వెళ్లేందుకు ఆసక్తి చూపిస్తున్నట్లు సమాచారం. సీనియర్ జట్టు జూన్‌లో ఇంగ్లాండ్‌కు వెళ్లనుంది. ఆలోగా ఇండియా A జట్టు పర్యటన ఉండనుందని క్రికెట్ వర్గాలు చెబుతున్నాయి.**

రోహిత్ కెప్టెన్సీలో ప్రత్యేకత అదే: సెహ్వాగ్



"గత ఆస్ట్రేలియా పర్యటన తర్వాత నుంచి బీసీసీఐ పెద్దలతో గంభీర్ ఇదే విషయంపై చర్చించాడు. భారత్ %ూ% జట్టుతోపాటు అతడు ప్రయాణిస్తే.. రిజర్వ్ బెంచ్‌ను మరింత బలంగా మార్చుకొనే అవకాశం ఉంటుందనేది అతడి అభిప్రాయం. అలాగే భారత్ A పర్యటనల్లో ఓ కీలక విషయం గుర్తించాడు. ద్రవిడ్ ప్రధాన కోచ్‌గా వచ్చాకనే పరిపూర్ణమైన సిరీస్‌లను నిర్వహించారు. అవి ప్రధాన సిరీస్‌లకు ప్రతిబింబంగా నిలిచేవి. అందుకే, ఇండియా A జట్టుతో కలిసి వెళ్తే ప్రయోజనం ఉంటుందని గంభీర్ భావిస్తున్నాడు" అని క్రికెట్ వర్గాలు తెలిపాయి.

**అప్పుడు ద్రవిడ్.. ఆ తర్వాత వీవీఎస్ లక్ష్మణ్**

భారత జట్టు ప్రధాన కోచ్‌గా రవిశాస్త్రి ఉన్నప్పుడు 'ఇండియా A టీమ్‌తో కలిసి రాహుల్ ద్రవిడ్ వెళ్లేవాడు. ద్రవిడ్ ప్రధాన కోచ్ అయిన తర్వాత వీవీఎస్ లక్ష్మణ్‌కు ఆ బాధ్యతలు అప్పగించడం జరిగింది. అప్పుడు వీరిద్దరూ ఎన్‌సీఏ చీఫ్‌గా ఉండేవారు. ద్రవిడ్ కోచ్‌గా వెళ్లిపోయిన తర్వాత అంతా లక్ష్మణ్‌కు అవకాశం వస్తుందని భావించారు. కానీ, లక్ష్మణ్‌ను కాదని బీసీసీఐ గంభీర్‌ను ఎంపిక చేసింది.

# దిల్లీదే ఫైనల్ బెర్తు

## ఆర్సీబీ చేతిలో ముంబయి ఓటమి

## మెరిసిన స్మృతి, స్నేహ్




**డబ్ల్యూపీఎల్-3లో దిల్లీ క్యాపిటల్స్ ఫైనల్ బెర్తు చేజిక్కించుకుంది. ఆఖరి లీగ్ మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు చేతిలో ముంబయి ఇండియన్స్ ఓడిపోవడంతో దిల్లీ ఫైనల్లో అడుగుపెట్టింది. 10 పాయింట్లతో సమానంగా ఉన్నప్పటికీ మెరుగైన రన్‌రేట్‌తో దిల్లీ (0.396).. ముంబయి (0.192)ను వెనక్కి నెట్టి నేరుగా తుదిపోరుకు అర్హత సాధించింది. ఆ జట్టుకు ఇది వరుసగా మూడో ఫైనల్. గురువారం గుజరాత్ జెయింట్స్‌తో ముంబయి ఎలిమినేటర్ ఆడనుంది. మరోవైపు వరుసగా అయిదు ఓటములతో ప్లేఆఫ్స్ రేసుకు ఇప్పటికే దూరమైన డిఫెండింగ్ ఛాంపియన్ బెంగళూరు.. విజయంతో టోర్నీని ముగించింది.**

**ముంబయి**

డబ్ల్యూపీఎల్‌లో బెంగళూరుకు ఊరట విజయం. ఆల్‌రౌండ్ ప్రదర్శన చేసిన ఆ జట్టు ముంబయి ఇండియన్స్‌ను 11 పరుగుల తేడాతో ఓడించింది. మంగళవారం మొదట ఆర్సీబీ 3 వికెట్లకు 199 పరుగులు చేసింది. కెప్టెన్ స్మృతి మంధాన (53బీ 37 బంతుల్లో 6ఐ4, 3ఐ6), ఎలీస్ పెర్రీ (49 నాటౌట్‌బీ 38 బంతుల్లో 5ఐ4, 1ఐ6) సత్తా చాటారు. ఛేదనలో నాట్ సీవర్ (69బీ 35 బంతుల్లో 9ఐ4, 2ఐ6) మెరిసినా.. ముంబయి 9 వికెట్లకు 188 పరుగులే సాధించగలిగింది. స్నేహ్‌రాణా (3/26), ఎలీస్ పెర్రీ (2/53), కిమ్ గార్త్ (2/33) ప్రత్యర్థిని కట్టడి చేశారు.

**సీవర్ బాదినా..:** భారీ ఛేదనలో ముంబయి ఆరంభంలో మెరుగ్గానే ఆడింది. రెండో ఓవర్లో మూడు ఫోర్లు బాదిన హేలీ మాథ్యూస్ (19) ఇన్నింగ్స్‌కు ఊపు తెచ్చింది. కానీ స్నేహ్‌రాణా ఓవర్ తేడాతో ఓపెనర్లు హేలీ, అమేలియా కెర్ (9)లను ఔట్ చేసి ముంబయిని దెబ్బ కొట్టింది. ఈ స్థితిలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (20), నాట్ సీవర్ నిలిచారు. వీరు కొన్ని షాట్లు ఆడి ముంబయి మరీ వెనుకబడకుండా చూసుకున్నారు. కానీ సాధించాల్సిన రన్‌రేట్‌ను మాత్రం నియంత్రణలోకి తీసుకు రాలేకపోయారు. 60 బంతుల్లో 122 పరుగులు చేయాల్సిన స్థితిలో హర్మన్‌ప్రీత్ ఔట్ కావడంతో ముంబయికి ఎదురు దెబ్బ తగిలింది. నాట్ సీవర్ మాత్రం తగ్గలేదు. సిక్స్‌లతో చెలరేగి స్కోరు పెంచింది. అర్ధసెంచరీ చేసి ప్రమాదకరంగా మారుతున్న ఆమెను పెర్రీ పెవిలియన్ చేర్చింది. 30 బంతుల్లో 71 పరుగులు చేయాల్సి రాగా.. యాస్తిక (4), అమన్‌జ్యోత్ కౌర్ (17), కమలిని (6) తక్కువ స్కోర్లకే వెనుదిరగడంతో ముంబయి ఓటమి అంచున నిలిచింది. ఆఖరి ఓవర్లో 28 పరుగులు అవసరం కాగా.. సజన (23) రెండు సిక్స్‌లు బాది జట్టులో ఆశలు రేపింది. కానీ ఆమెను ఔట్ చేసిన పెర్రీ.. ముంబయి కథ ముగించింది.

**మెరిసిన స్మృతి, పెర్రీ:** అంతకుముందు బెంగళూరు ఇన్నింగ్స్‌లో స్మృతి మంధాన, ఎలీస్ పెర్రీ ఆటే హైలైట్. ఇన్నింగ్స్‌కు వెన్నెముకలా నిలిచిన ఈ ఇద్దరూ.. ఆర్సీబీకి భారీ స్కోరు అందించారు. ముఖ్యంగా ఈ సీజన్లో వరుసగా విఫలమైన స్మృతి.. ఆఖరి మ్యాచ్‌లో సత్తా చాటింది. సబ్బినేని మేఘన (26)తో కలిసి తొలి వికెట్‌కు 41 పరుగులు జత చేసి శుభారంభం అందించింది. మేఘన ఔటైనా.. ఎలీస్ పెర్రీ తోడుగా స్మృతి స్కోరు పెంచింది. అమేలియా వేసిన ఎనిమిదో ఓవర్లో స్మృతి రెండు సిక్స్‌లు బాదడంతో స్కోరుబోర్డు పరుగులెత్తింది. అర్ధసెంచరీ తర్వాత మంధాన వెనుదిరిగినా.. రిచా ఘోష్ (36బీ 22 బంతుల్లో 5ఐ4, 1ఐ6) తోడుగా పెర్రీ జోరు కొనసాగించింది. 18 ఓవర్లకు ఆర్సీబీ 160/3తో నిలిచింది. ఆ జట్టు 180 అయినా చేస్తుందా అనిపించింది. అయితే ఆఖర్లో పెర్రీ, జార్జియా వేర్‌హామ్ (31 నాటౌట్‌బీ 10 బంతుల్లో 5ఐ4, 1ఐ6) చెలరేగడంతో ఆర్సీబీ ఊహించని స్కోరు చేసింది. చివరి రెండు ఓవర్లలో బెంగళూరు 39 పరుగులు రాబట్టింది. ముంబయి బౌలర్లలో హేలీ మాథ్యూస్ (2/37) రాణించింది.

**బెంగళూరు ఇన్నింగ్స్:** సబ్బినేని మేఘన (సి) పరుణిక (బి) హేలీ 26బీ స్మృతి మంధాన (సి) షబ్నిమ్ (బి) అమేలియా 53బీ ఎలీస్ పెర్రీ నాటౌట్ 49బీ రిచా (సి) నాట్ సీవర్ (బి) హేలీ 36బీ వేర్‌హామ్ నాటౌట్ 31బీ ఎక్స్‌ట్రాలు 4 మొత్తం: (20 ఓవర్లలో 3 వికెట్లకు) 199బీ వికెట్ల పతనం: 1-41, 2-100, 3-153బీ బౌలింగ్: షబ్నిమ్ ఇస్మాయిల్ 4-0-41-0బీ నాట్ సీవర్ 2-0-16-0బీ హేలీ 4-0-37-2బీ అమన్‌జ్యోత్ 4-0-27-0బీ అమేలియా 3-0-47-1బీ సంస్కృతి 1-0-6-0బీ పరుణిక 2-0-24-0

**ముంబయి ఇన్నింగ్స్:** హేలీ (సి) హెథర్ (బి) స్నేహ్ రాణా 19బీ అమేలియా కెర్ (సి) స్మృతి (బి) స్నేహ్ రాణా 9బీ నాట్‌సీవర్ (సి) అండ్ (బి) పెర్రీ 69బీ హర్మన్‌ప్రీత్ (సి) రిచా (బి) కిమ్ గార్త్ 20బీ అమన్‌జ్యోత్ (బి) హెథర్ 17బీ యాస్తిక (సి) అండ్ (బి) స్నేహ్ రాణా 4బీ సజన (సి) మేఘన (బి) పెర్రీ 23బీ కమిలిని (సి) పెర్రీ (బి) వేర్‌హామ్ 6బీ సంస్కృతి (సి) జోషిత (బి) కిమ్ గార్త్ 10బీ షబ్నిమ్ నాటౌట్ 4బీ పరుణిక నాటౌట్ 0బీ ఎక్స్‌ట్రాలు 7 మొత్తం: (20 ఓవర్లలో 9 వికెట్లకు) 188బీ వికెట్ల పతనం: 1-27, 2-38, 3-78, 4-129, 5-134, 6-140, 7-152, 8-167, 9-188బీ బౌలింగ్: కిమ్ గార్త్ 4-0-33-2బీ ఎలీస్ పెర్రీ 4-0-53-2బీ స్నేహ్ రాణా 4-0-26-3బీ హెథర్ గ్రాహమ్ 4-0-47-1బీ జార్జియా వేర్‌హామ్ 4-0-29-1

# టెస్టులు, టీ20ల్లో ఆడే అవకాశం రాలేదు.. అయినా..: ఆ సైలెంట్ హీరోపై కైఫ్ ప్రశంసలు

**అద్భుత ప్రదర్శనతో ఓటమే ఎరగకుండా ఛాంపియన్స్ ట్రోఫీలో టీమ్ఇండియా జైత్రయాత్ర కొనసాగించింది. అన్ని విభాగాల్లో రాణించి టైటిల్‌ను గెలుచుకుంది. ఆటగాళ్లందరూ గొప్పగా రాణించి ఈ విజయంలో తమవంతు పాత్ర పోషించారు. ఇక ఈ టోర్నీలో టీమ్ఇండియా తరఫున టాప్ స్కోరర్‌గా నిలిచిన సైలెంట్ హీరో శ్రేయస్ అయ్యర్‌పై మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ ప్రశంసలు కురిపించాడు.**



టీ20, టెస్టుల్లో ఆడే అవకాశం శ్రేయస్‌కు రావడం లేదని.. వన్డేల్లో మాత్రమే ఎంపికవుతున్నాడని కైఫ్ పేర్కొన్నాడు. దీంతో అతడిపై ఈ ఫార్మాట్‌లో ఒత్తిడి పెరిగిందని.. అయినప్పటికీ గొప్ప ప్రదర్శన చేశాడని, అదే తనను ఆకట్టుకుందని చెప్పాడు. "అతడి ఫామ్ నన్ను ఆశ్చర్యానికి గురిచేసింది. అతడు టెస్టుల్లో ఆడటం లేదు.. టీ20లకూ ఎంపికవడం లేదు. కేవలం టీమ్ఇండియా తరఫున వన్డేల్లో మాత్రమే ఆడుతున్నాడు. నిరంతరం జట్టులో భాగం కావడం లేదు. ముంబయి తరఫున రంజీ ట్రోఫీ ఆడి నేరుగా ఛాంపియన్స్ ట్రోఫీలోకి వచ్చాడు. అయినప్పటికీ తన సహజమైన ఆట తీరుతో బౌండరీలు, అటాకింగ్ షాట్లతో విరుచుకుపడ్డాడు" అని శ్రేయస్ ఫామ్‌ను కైఫ్ కొనియాడాడు.

రోహిత్ కెప్టెన్సీలో ప్రత్యేకత అదే: సెహ్వాగ్

"బ్యాటింగ్ ఆర్డర్‌లో నాలుగో స్థానంలో ఆడటానికి చాలామంది ఆటగాళ్లు వచ్చి వెళ్లారు. అయితే.. శ్రేయస్ మాత్రం ఈ స్థానంలో గొప్ప ఇన్నింగ్స్ ఆడుతూ తన ప్లేస్‌ను సుస్థిర పరుచుకున్నాడు. అతడు ఈ టోర్నీలో అత్యధిక పరుగులు చేసిన రెండో ఆటగాడు. అయినా ఒక్క 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' కూడా దక్కలేదు" అని కైఫ్ పేర్కొన్నాడు.

ఈ ఛాంపియన్స్ ట్రోఫీలో శ్రేయస్ అయ్యర్ నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి అదరగొట్టాడు. ఆడిన ఐదు మ్యాచ్‌ల్లో 243 పరుగులు చేసి టీమ్ఇండియా తరఫున అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. మొత్తంగా ఈ జాబితాలో రచిన్ రవీంద్ర తర్వాత రెండో స్థానంలో ఉన్నాడు. విలువైన ఇన్నింగ్స్‌తో జట్టు విజయాల్లో కీలకంగా మారాడు. అతడు ఆడిన చివరి నాలుగు మ్యాచ్‌ల్లో ఒక్కోదాంట్లో 40 కంటే ఎక్కువ పరుగులు బాదాడు. ఇందులో గ్రూప్ స్టేజ్‌లో పాకిస్థాన్, న్యూజిలాండ్‌లపై అర్ధ శతకాలు ఉన్నాయి. 2023 వన్డే ప్రపంచకప్‌లో కూడా శ్రేయస్ గొప్ప ప్రదర్శన చేశాడు. మొత్తం 11 మ్యాచ్‌ల్లో 530 పరుగులు చేశాడు. వన్డే ఫార్మాట్‌లో నాలుగో స్థానంలో నమ్మకమైన, స్థిరమైన బ్యాటర్‌గా కొనసాగుతున్నాడు.

CINIMA NEWS
https://epaper.teluguraastram.com
తెలుగురాష్ట్రం దినపత్రిక



# ఈమె అందాల ఐశ్వర్యం

కేరళలో పుట్టి పెరిగిన ముద్దుగుమ్మ ఐశ్వర్య మీనన్ తమిళ్ సినిమాతో ఇండస్ట్రీలో అడుగు పెట్టింది. 2012లో 'కాదలిల్ సోదప్పువదు యెప్పడి'లో ముఖ్య పాత్రలో నటించడం ద్వారా ప్రేక్షకులకు పరిచయం అయింది. తక్కువ సమయంలోనే కోలీవుడ్‌లో ఈ అమ్మడికి గుర్తింపు లభించింది. 2013 నుంచి వరుసగా తమిళ్ సినిమాలు చేస్తూ వస్తున్న ఐశ్వర్య మీనన్ పలువురు స్టార్ హీరోల సినిమాల్లో కనిపించి అక్కడ స్టార్ హీరోయిన్‌గా నిలిచింది. తమిళ్‌తో పాటు కన్నడ సినిమాలోనూ నటించే అవకాశాన్ని ఐశ్వర్య మీనన్ సొంతం చేసుకుంది. తెలుగులో స్పై, భజే వాయు వేగమ్ సినిమాల్లో నటించడం ద్వారా టాలీవుడ్ ప్రేక్షకులకు చేరువ అయింది. సోషల్ మీడియాలో 3.2 మిలియన్‌ల ఫాలోవర్స్‌ను కలిగి ఉన్న ఐశ్వర్య మీనన్ రెగ్యులర్‌గా అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. తద్వార తన ఫాలోవర్స్‌కి వినోదాన్ని పంచుతూ ఉంటుంది. తాజాగా మరోసారి ఐశ్వర్య మీనన్ అందమైన ఫోటోలను షేర్ చేసింది. క్యూట్ ఐశ్వర్య మీనన్ ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఎక్కువ స్కిన్ షో చేయకున్నా ఐశ్వర్య మీనన్ ఫోటోలు ఎప్పుడూ అందరి దృష్టిని ఆకర్షిస్తూ ఉంటాయి. చూడ్డానికి నాజూకుగా కనిపిస్తూ ఉండే ఐశ్వర్య మీనన్ మరోసారి తన సుందరమైన లుక్ ఫోటోలను అత్యంత స్టైలిష్‌గా ఉన్న రూపంను ఫోటోల రూపంలో షేర్ చేసి అందరి దృష్టిని ఆకర్షించింది. ఎంతో మంది హీరోయిన్స్‌తో పోల్చితే ఐశ్వర్య మీనన్ అందం విషయంలో టాప్ ఉంటుందని, కానీ ఈమెకు దక్కాల్సిన గుర్తింపు దక్కడం లేదు, రావాల్సిన ఆఫర్లు రావడం లేదు అంటూ కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా టాలీవుడ్‌లో ఈమె నటించిన రెండు సినిమాలు పెద్దగా ఆడలేదు. దాంతో తెలుగులో ఈమెకు మరో ఆఫర్ ఇప్పటి వరకు రాలేదు. ముందు ముందు అయినా తెలుగులో ఈమెకు మంచి గుర్తింపు దక్కాలంటూ ఈ ఫోటోలు చూసిన వారు కామెంట్ చేస్తున్నారు. ఇంతటి అందగత్తెకు కచ్చితంగా మంచి ఆఫర్ దక్కాలనే అభిప్రాయంను మీడియా వర్గాల వారు సైతం వ్యక్తం చేస్తున్నారు. ఈమధ్య కాలంలో బాజూకా అనే మలయాళ సినిమా ఆఫర్‌ను సొంతం చేసుకుంది. చాలా ఏళ్ల క్రితం మలయాళ సినిమాలో నటించిన ఐశ్వర్య మీనన్ అప్పుడు ఆశించిన స్థాయిలో విజయాన్ని సొంతం చేసుకోలేక పోయింది. అందుకే పెద్దగా ఆఫర్లు రాలేదు. అయినా కూడా ఐశ్వర్యకు మలయాళంలో ఈ సినిమాలో నటించే అవకాశం దక్కింది. తమిళంలో ఒక సినిమాకు సంబంధించిన చర్చలు జరుగుతున్నాయి. త్వరలోనే ఆ సినిమా పట్టాలెక్కే అవకాశాలు ఉన్నాయి. తెలుగులో కూడా ఈమె నటించాలని కోరుకునే వారు చాలా మంది ఉన్నారు. మరి ఎప్పటికి తెలుగులో ఈ అమ్మడికి ఆఫర్ వస్తుంది అనేది చూడాలి.

# ఓటీటీ ఫామ్‌లోకి ప్రేమకథ

ప్రతి ఏడాదికి వాలెంటైన్స్ డే సందర్భంగా ప్రేమకథలతో కూడిన సినిమాలు ప్రేక్షకులను అలరిస్తుంటాయి. ఈ సారి, 14వ ఫిబ్రవరి 2025న విడుదలైన '2%ఖ% లవ్ స్టోరీ' చిత్రం, ప్రేమ, స్నేహం మరియు సంబంధాల మధ్య ఉన్న అనుబంధాలను గౌరవంగా చూపించే కథతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ సినిమా, తమిళ్ చిత్ర పరిశ్రమలో విడుదలవ్వగా, అమెజాన్ ప్రైమ్ మరియు ఆహా (తమిళ్)లో స్ట్రీమింగ్ అవుతుంది.



**'2K లవ్ స్టోరీ' సినిమా విశేషాలు**

ఈ సినిమా, 'జగ్ వీర్' మరియు 'మీనాక్షి గోవిందరాజన్' ప్రధాన పాత్రలను పోషించారు. ఈ చిత్రం యువతలో ఎక్కువగా ఆసక్తిని కలిగించినా, థియేటర్లలో పెద్దగా వసూళ్లు సాధించలేదు. అయితే, ఓటీటీ వేదికపై ఈ సినిమా ఎలా స్పందించిందనే దానిపై ఇప్పుడు అంతా ఆసక్తిగా ఉన్నారు.

**సినిమా కథ**

'2K లవ్ స్టోరీ' ప్రధానంగా యువతీ, యువకుల మధ్య ప్రేమ, స్నేహం, మరియు సంబంధాల భావాలను చర్చిస్తుంది. ఈ సినిమా కాలం మారినట్లుగా, స్నేహాలు, ప్రేమలు, సంబంధాలు ఎలా ఉన్నాయి అనే అంశాల చుట్టూ తిరుగుతుంది. ఈ కథలో, ఒక కొత్త తరగతి యొక్క యువత ప్రవర్తన, వారి సంబంధాల పై బలమైన దృష్టికోణం చూపించబడింది.

**కథా సారం**

ప్రేమ కథలు మన జీవితాలలో ముఖ్యమైన చోటు సంపాదించుకున్నాయి. '2%ఖ% లవ్ స్టోరీ' కూడా అదే తరహా ప్రేమకథను ప్రదర్శించడానికి అనేక అంశాలను జోడించింది. ఈ కథ స్నేహం మరియు ప్రేమ భావాలను ప్రతిబింబించేలా ప్రదర్శించబడింది.

**ప్రేమ ఎప్పటికీ అపరిచితమైనది కాదు.**

స్నేహం కూడా ఒక రకమైన ప్రేమనే. సంబంధాల్లో భావోద్వేగాలను, ఇతర రకాల అనుబంధాలను ఎలా చూపించాలో ఈ సినిమా కళ్లకు మరింత చేరువుగా చూపించింది.

**దర్శకత్వం మరియు అభిప్రాయం**

సినిమా దర్శకుడు సుశీంద్రన్, ఈ చిత్రాన్ని ప్రతిస్పందనలను సరిగ్గా ఆకట్టుకునేలా రూపొందించారు. కానీ థియేటర్లలో సినిమా వసూళ్లలో పెద్దగా విజయం సాధించలేదు. అటు ఓటీటీ వేదికలో మాత్రం సినిమా ఈ కథపై మరింతగా విజయం సాధించగలుగుతుందనే ఉత్కంఠ కనిపిస్తోంది.

**వాలెంటైన్స్ డే స్పెషల్**

వాలెంటైన్స్ డే సందర్భంగా ఈ సినిమా విడుదల కావడం, దానికి సంబంధించిన ప్రత్యేకమైన ఉత్సాహాన్ని యువతకు అందించింది. ఈ రోజు ప్రత్యేకంగా ప్రేమకు సంబంధించిన సినిమాలను ఎక్కువగా చూసేందుకు యువత ఆసక్తి చూపిస్తుంది. '2%ఖ% లవ్ స్టోరీ' ఈ నేపథ్యంలో ప్రేక్షకులను ఆకట్టుకునేందుకు సిద్ధంగా ఉంది.

**సినిమా రివ్యూ**

తొలుత విడుదలైన తరువాత, '2K లవ్ స్టోరీ' గురించి పెద్దగా చర్చలు జరగలేదు. అయితే, ఓటీటీ స్ట్రీమింగ్ ద్వారా ఈ సినిమా మరింత ప్రేక్షకులను ఆకర్షిస్తుందని భావిస్తున్నారు. సినిమాకు మిశ్రమ రివ్యూ లభించినప్పటికీ, ప్రేమకథలోని మనోహరత, సంబంధాలకు చెందిన క్లిష్టతను అద్భుతంగా చూపించిన దర్శకుడికి ప్రశంసలు లభించాయి.

**'2K లవ్ స్టోరీ' - ఓటీటీ స్ట్రీమింగ్**

ఈ సినిమాను అమెజాన్ ప్రైమ్ మరియు ఆహా (తమిళ్) లో స్ట్రీమింగ్ చేస్తారు. ఓటీటీ ప్లాట్‌ఫామ్ ద్వారా ఈ సినిమా యువతకు మరింత చేరువయ్యే అవకాశం ఉంది. థియేటర్లలో వసూళ్లు సాధించకపోవడం, ఓటీటీకి వచ్చే రెస్పాన్స్ ఇంకా పెద్దగా తెలియలేదు. మరి, ఈ సినిమా ఓటీటీ ద్వారా ఎంతగా విజయం సాధిస్తుందో చూడాలి.

# ఓటీటీలో 'ముఫాసా..'

'ముఫాసా : ది లయన్ కింగ్' ఓటీటీలోకి రాబోతుంది. తాజాగా ఈ సినిమా ఓటీటీ అప్‌డేట్‌ని చిత్రబృందం ప్రకటించింది. 'ది లయన్ కింగ్' సినిమాకు ప్రీక్వెల్‌గా వచ్చిన ఈ చిత్రం డిసెంబర్ 20న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఇండియాలో దాదాపు రూ.100 కోట్ల వసూలు చేసింది. తెలుగులో ముఫాసా పాత్రకు మహేశ్ బాబు డబ్బింగ్ చెప్పగా.. బాలీవుడ్ హిందీ వెర్షన్‌కి షారుఖ్ ఖాన్ డబ్బింగ్ చెప్పాడు. ఈ చిత్రం మార్చి 26 నుంచి తెలుగుతో పాటు ఇంగ్లీష్, హిందీ, తమిళం భాషల్లో ఓటీటీ వేదిక జియో హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ కాబోతోంది.





# 'దిల్రుబా' ఓవర్సీస్ రైట్స్ ని సొంతం చేసుకున్న ప్రముఖ బ్యానర్




కిరణ్ అబ్బావరం తన రాబోయే ఎంటర్టైనర్ 'దిల్రుబా'తో కలిసి సినిమా ప్రేమికులను అలరించడానికి సిద్ధమవుతున్నారు. మేకర్స్ ఈ చిత్రాన్ని భారీగా ప్రమోట్ చేస్తున్నారు. ఈ సినిమాలో రుక్సార్ ధిల్లాన్, కీర్తి హీరోయిన్లుగా నటిస్తున్నారు. తాజాగా ఇప్పుడు ఫునాసియా ఫిలిమ్స్ మరియు మరుధర్ ఈ సినిమాని ఓవర్సీస్ లో విడుదల చేయనున్నట్లు సమాచారం. ఈ విషయాన్ని తెలియజేసేందుకు మూవీ మేకర్స్ సోషల్ మీడియాలో సరికొత్త పోస్టర్ ని విడుదల చేసారు. ఈ చిత్రంలో నాజియా డేవిసన్ ముఖ్యమైన పాత్రలో నటించారు. ఈ చిత్రానికి రవి, జోజో జోస్, రాకేశ్ రెడ్డి మరియు సరిగమ బ్యాంక్రోల్ చేశారు. కిరణ్ అబ్బావరం దిల్రుబాతో సినీ ప్రేమికులను ఆకర్షించడానికి మరియు బాక్సాఫీస్ వద్ద హిట్ స్కోర్ చేయడానికి సిద్ధమవుతున్నారు. ఈ సినిమలో ఆదుకళం నరేన్, తులసి, సత్య కీలక పాత్రలలో నటించారు. డానీ విశ్వస్ సినిమాటోగ్రాఫర్ మరియు ప్రవీణ్ కెఎల్ ఈ చిత్రానికి ఎడిటర్, సామ్ సిఎస్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రం 14 మార్చి 2025న విలాసవంతమైన రీతిలో గొప్ప విడుదల కావడానికి సిద్ధంగా ఉంది.

# ఎల్లో ఎల్లో బ్యూటీ ఫెల్లో

కన్ను గీటి, ముద్దుగన్ను పేల్చి ఓవర్ నైట్‌లో జాతీయ స్థాయిలో సెలబ్రెటీ అయిన ప్రియా ప్రకాష్ వారియర్ తాజాగా 'నిలవుకు ఎన్ మెల్ ఎన్నడి కోబం' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ధనుష్ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాలో ప్రియా ప్రకాష్ వారియర్ కీలక పాత్రలో నటించి మెప్పించింది. ఆ సినిమాతో పాటు విష్ణు ప్రియ అనే కన్నడ మూవీలోనూ నటించింది. ఆ మధ్య ఈ అమ్మడి కెరీర్ కాస్త దల్‌గా సాగింది. కానీ ఇప్పుడు పరిస్థితి వేరుగా ఉంది. ఈ ఏడాదిలో ఇప్పటికే రెండు సినిమాలతో వచ్చిన ప్రియా ప్రకాష్ వారియర్ మరో రెండు మూడు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయని ఇండస్ట్రీ వర్గాల ద్వారా సమాచారం అందుతోంది. ప్రియా ప్రకాష్ వారియర్ తెలుగులోనూ పలు సినిమాల్లో నటించింది. చెక్, ఇష్క్ సినిమాల్లో నటించింది. కానీ ఆ సినిమాలు బాక్సాఫీస్ వద్ద బొక్కబోర్లా పడటంతో తెలుగులో పెద్దగా ఆఫర్లను ఈ అమ్మడు సొంతం చేసుకోలేక పోతుంది. పవన్ కళ్యాణ్ బ్రో సినిమాలో కీలక పాత్రలో నటించడంతో పాటు మరికొన్ని సినిమాల్లో చిన్న పాత్రల్లో కనిపించింది. టాలీవుడ్‌లో ఈ అమ్మడికి ఆశించిన స్థాయిలో గుర్తింపు దక్కడం లేదు. కానీ సోషల్ మీడియాలో ఈమె షేర్ చేసే అందమైన ఫోటోల కారణంగా తెలుగు రాష్ట్రాల్లోనూ మంచి ఫాలోయింగ్‌ను సొంతం చేసుకుంది. ఇంత అందమైన అమ్మాయికి ఎందుకు తెలుగులో ఆఫర్లు రావడం లేదని కొందరు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియా ద్వారా రెగ్యులర్‌గా అందమైన ఫోటోలను షేర్ చేసే ప్రియా ప్రకాష్ వారియర్ తాజాగా ఎల్లో డ్రెస్‌లో కనిపించి అందరి దృష్టిని ఆకర్షించింది. సాధారణంగా ఎల్లో ఎల్లో దర్టీ ఫెల్లో అంటారు... కానీ ఈ ఫోటోల్లో ప్రియా ప్రకాష్ వారియర్‌ను చూస్తూ ఉంటే దాన్ని మార్చి ఎల్లో ఎల్లో బ్యూటీ ఫెల్లో అనాలి అనిపిస్తుందని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఇలాంటి అందమైన ఫోటోలను షేర్ చేసినప్పుడు మరో ఐదు పది సంవత్సరాల పాటు ఇండస్ట్రీలో ప్రియా వారియర్ ఉంటుంది, ఆమె కచ్చితంగా ముందు ముందు తెలుగులోనూ మంచి సినిమాల్లో నటించే అవకాశాలు దక్కించుకుంటుంది అంటున్నారు. చూడ్డానికి క్యూట్‌గా అనిపించడంతో పాటు, స్కిన్ షో విషయంలో ఇతర హీరోయిన్స్‌తో పోటీ పడుతూ ఉంటుంది. అందుకే ప్రియా ప్రకాష్ వారియర్‌కి కన్నడ, తమిళ్ సినిమాల్లో క్రమం తప్పకుండా ఆఫర్లు వస్తున్నాయి. ఇండస్ట్రీలో ఈమె చేసిన సినిమాలు, చేస్తున్న సినిమాల విషయం పక్కన పెడితే భవిష్యత్తులో మరిన్ని మంచి సినిమాలు ఈమె నుంచి వచ్చే అవకాశం ఉందని, హిందీలోనూ ఈమెకు మంచి ఆఫర్లు వస్తాయనే నమ్మకంను ఇండస్ట్రీ వర్గాల వారు వ్యక్తం చేస్తున్నారు. ఇదే స్థాయిలో అందంగా కనిపిస్తే ముందు ముందు ఈమెకు మరిన్ని ఆఫర్లు రావడం ఖాయం.



TELUGU RASTRAM . Printed, Published and Owned by AITHABATHULA RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: AITHABATHULA RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339